నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
గురువారం | జనవరి 18, 2024 | www.navatelangana.com

పేద ప్రజల గొంతుక నవతెలంగాణ

- క్యాలెండర్ ఆవిష్కరించిన కలెక్టర్ జితేశ్ వి పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి

పేద ప్రజల గొంతుక 'నవతెలంగాణ' అని కామారెడ్డి జిల్లా కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయ చాంబర్‌లో నవతెలంగాణ దినపత్రిక క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు అవసరమైన విషయాలను, వారి కష్టాలను ఎప్పటికప్పుడు వెలికితీస్తూ ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకువస్తూ వారి సమస్యల పరిష్కారానికి నవతెలంగాణ కృషి చేస్తుందన్నారు. మున్ముందు మరింత పేదల పక్షాన నిలబడి పనిచేయాలన్నారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి నరేశ్, కామారెడ్డి విలేకరి మోహన్ తదితరులు పాల్గొన్నారు.


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్

బైకు దొంగ అరెస్ట్

నవతెలంగాణ-కంఠేశ్వర్

బైకును దొంగలించిన నిందితుడిని అరెస్టు చేసినట్లు మూడవ పోలీస్ స్టేషన్ ఎస్ఐ ప్రవీణ్ బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 15వ తేదీనా ఉదయం 9.45 గంటలకు నగరంలోని కంఠేశ్వర్‌కు చెందిన సిరిగిరి తిరుపతి తన మోటార్ సైకిల్‌ను సుభాష్ నగర్ లో గల ఒక హోటల్ ముందు పార్క్ చేసి హోటల్లో కి వెళ్ళి టిఫిన్ చేశాడు. బయటకు వచ్చే సరికి ఎవరో గుర్తు తెలియని దొంగలు బైక్‌ను ఎత్తుకెళ్లారు. ఈ విషయమై టౌన్ 3 పోలీస్ స్టేషన్ లో వాహనానికి సంబంధించిన బాధితుడు పిర్యాదు ఇవ్వగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.అట్టి మోటార్ సైకిల్ ను దొంగతనం చేసిన హమాల్ వాడి కి చెందిన రాజే రంజిత్ ను అరెస్ట్ చేసి తన వద్ద నుండి దొంగలించిన మోటార్ సైకిల్ ను స్వాధీన పరుచుకొని రిమాండ్‌కు తరలించినట్లు మూడవ పోలీస్ స్టేషన్ ఎస్ఐ ప్రవీణ్ తెలియజేశారు.

'బెల్టు'దందా జోరు

- వైన్స్‌ల టెండర్‌లతో ప్రభుత్వానికి రూ.44 కోట్ల ఆదాయం..
- బెల్ట్‌దుకాణాలతో వీడీసీలకు ఏకంగా రూ.300 కోట్లకుపైగా ఆదాయం
- విచ్చలవిడిగా మద్యం సరఫరాతో పెరుగుతున్న నేరాలు
- కొత్త ప్రభుత్వం కట్టడి చేసేనా..?



నవతెలంగాణ-కామారెడ్డి

జిల్లా వ్యాప్తంగా వైన్స్‌ల టెండర్‌లతో ప్రభుత్వానికి రూ.44 కోట్ల ఆదాయం వస్తుంటే బెల్ట్‌దుకాణాలతో వీడీసీలకు ఏకంగా సుమారు రూ.300 కోట్లకుపైగా ఆదాయం సమకూరుతుండటం.. బెల్ట్ దందా తీరుకు నిదర్శనంగా నిలుస్తుంది. బెల్ట్‌షాపుల్లో విచ్చలవిడిగా 24 గంటల పాటూ మద్యం లభిస్తుండటంతో గ్రామాల్లో మద్యం ఏరులై పారుతోంది. దీంతో నేరాల సంఖ్య పెరుగుతోందని మహిళలు వాపోతున్నారు. మద్యం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుండటంతో దాన్ని సేవించే వారి సంఖ్య క్రమంగా పెరుగుతూ ఇల్లును గుల్ల చేసుకుంటున్నారని ఆరోపణలు వ్యక్తం చేస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి బెల్ట్‌షాపులను పూర్తిగా తొలగించాలని ఆదేశించిన నేపథ్యంలో బెల్ట్ దందా నిలిచిపోయేనా..? అని ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

గ్రామాలలో రోజురోజుకు బెల్టు షాపులు బెడద పెరిగిపోతుందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం లేచింది మొదలు రాత్రి వరకు పెద్దల నుండి మొదలుకొని యువకులు సైతం ఆ బెల్ట్ షాపుల్లోనే ఉంటున్నారని, దీంతో తమకు ఇల్లు గడవడం కష్టంగా ఉంటుందని పలువురు మహిలలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు తమ స్వార్థం కోసం పేద ప్రజలను బలి చేస్తున్నారని, గ్రామ అభివృద్ధి పేరుతో గ్రామ పెద్దలు కొందరు కలిసి గ్రామాలలో టెండర్‌లు నిర్వహించి లక్షలు వసూలు చేస్తూ కాయా కష్టం చేసి జీవిస్తున్న వారిని బలి చేస్తున్నారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

కామారెడ్డి జిల్లాలో 522 గ్రామపంచాయతీలు ఉన్నాయి. ఒక్కొక్క గ్రామంలో సుమారు 5 లక్షల నుంచి 25-30 లక్షల వరకు బెల్ట్ దుకాణాలకు టెండర్లు పలికినట్లు సమాచారం. కొన్ని పెద్ద గ్రామ పంచాయతీలలో ఏకంగా వైన్స్ నిర్వాహకులు గ్రామస్తుని కలుపుకొని టెండర్ పాడారని దీంతో గ్రామంలో రాత్రి పగలు తేడా లేకుండా మద్యం లభిస్తుంది. తాగిన వారికి తాగినంత అన్నట్లుగా మారింది.

గతంలో బెల్ట్‌దుకాణాలను మూసిన యువకులు

అయితే గతంలో పలువురు యువకులు చైతన్యవంతమై పలు గ్రామాల్లో బెల్ట్ దుకాణాలను మూసివేయించారు. కానీ నేడు ఆ పరిస్థితి ఎక్కడా లేదు. యువకులను మద్యం మత్తుకు బానిస చేస్తున్నారు. మద్యం నుంచి ఆదాయం పెంచుకునేందుకు విరివిగా గ్రామాల్లో బెల్ట్ షాపులను ప్రోత్సహించినట్టు గత పాలకులపై ప్రధానంగా ఆరోపణలు వ్యక్తమైయ్యాయి. గ్రామాలలో, ఏ చిన్న దేవాలయం ఉన్న అక్కడ బెల్ట్ షాపులను ఏర్పాటు చేసి మద్యాన్ని ప్రతి ఒక్కరికి అందుబాటులోకి తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకున్నట్టు ఆగ్రహం వ్యక్తమవుతుంది.

గతంలో బెల్ట్ దుకాణం నడపాలంటే భయపడేవారు. మద్యం అమ్మాలంటే వెనుకడుగు వేసేవారు. నేడు ఏకంగా గ్రామపంచాయతీ కిరణ దుకాణాలకు లైసెన్సులు ఇచ్చిన మాదిరిగా గ్రామస్తులు (గ్రామంలోని కొందరు పెద్దలు) వారి స్వార్థం కోసం అందరిని కట్టడి చేస్తూ బెల్ట్ దుకాణం టెండర్ పాడి బీదల పొట్ట కొడుతున్నారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వ దృష్టికి వచ్చినా, అధికారులకు తెలిసిన బెల్ట్ షాపులపై ఎలాంటి చర్యలు లేవు. అదే మాకు ప్రధాన ఆదాయ వానరు అన్న విధంగా గత ప్రభుత్వం వ్యవహరించడంతో అక్రమార్కులకు మార్గం సుగమయింది. జిల్లాలో కొందరు ఎక్కువగా మద్యం దుకాణాలను దక్కించుకొని ఎక్సైజ్ శాఖను వారికి గుప్పట్లో పెట్టుకొని నడిపిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గ్రామాలలో బెల్ట్ షాపులను నిరోధించి దేశ అభివృద్ధికి గ్రామాలే పట్టుకొమ్మలు అన్న నానుడిని నిజం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సీఎం పేషీలో ఉంది..

ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవీందర్ రాజు

ఈ విషయమై ఎక్సైజ్ సూపరింటెండెంట్‌ను సంప్రదించగా.. గ్రామాలలో బెల్ట్ షాపులు నడుస్తున్నాయని సమాచారం వచ్చినట్టు తెలిపారు. బెల్ట్‌షాపుల ఏర్పాటు చట్ట విరుద్ధం. ఈ విషయమై ప్రస్తుతం సీఎం పేషీలో ఉంది. ప్రభుత్వం నుండి ఎలాంటి ఆదేశాలు వస్తే వాటిని అమలు చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

బీజేపీ ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలపై

అఖిల భారత క్యాంపెయిన్

- 20న జిల్లా సదస్సు.. ఫిబ్రవరి 15 వరకు ఇంటింటా ప్రచారం
- విజయవంతం చేయాలి : సీఐటీయూ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకుల పిలుపు

నవతెలంగాణ-కంఠేశ్వర్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక రైతు ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్తంగా నెల రోజుల పాటు ప్రజా చైతన్య కార్యక్రమాలను నిర్వహించాలని సీఐటీయూ, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, తెలంగాణ రైతు సంఘం ఆల్ ఇండియా కమిటీలు పిలుపునిచ్చాయి. దీంట్లో భాగంగా ఈ నెల 20న జిల్లా సదస్సును జయప్రదం చేయాలని జిల్లా నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది వెంకట్రాములు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి వెంకటేష్ మాట్లాడారు. జనవరి 20న జిల్లా సదస్సు, 26న ట్రాక్టర్ ర్యాలీ, జనవరి 27 నుండి ఫిబ్రవరి 15 వరకు ఇంటింటా ప్రచారం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఫిబ్రవరి 16న సమ్మె ఉంటుందని తెలిపారు.

గడిచిన 10 ఏళ్లలో దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ కార్పొరేట్ శక్తులకు లబ్ధి చేరే విధంగా మోడీ పరిపాలన ఉందని అన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఉపాధి హామీ పథకాన్ని పట్టణ ప్రాంతాలకు విస్తరించి రోజుకు రూ.600లు చొప్పున 200 వందల రోజులు పని ది నాలు కల్పించాలన్నారు. రైతు ఉద్యమం జరిగిన సందర్భంలో చట్టాల ను వెనక్కి తీసుకునే విధంగా మోడీ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. బిజెపి ప్రభుత్వం రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేసి ప్రజల హక్కులను కాలరాసిందని మోడీ దుర్మార్గపు పాలన ప్రజల్లోకి తీసుకెళ్ల డం కోసం సిఐటియు వ్యవసాయ కార్మిక సంఘం రైతు సంఘం సంఘాలు ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహిస్తాయని తెలిపారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు శంకర్ గౌడ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఏశాల గంగాధర్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు విజయ, నన్నేసాబ్, జిల్లా కమిటీ సభ్యులు కృష్ణ ,గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థిగా బొమ్మ మహేష్ కుమార్‌గౌడ్

- అధికారికంగా ప్రకటించిన కాంగ్రెస్ అధిష్టానం

నవతెలంగాణ-కంఠేశ్వర్


బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థులను కాంగ్రెస్ పార్టీ అధికారికంగా ప్రకటించింది. నిజామాబాద్‌కు చెందిన సీనియర్ నేత, టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ కు అవకాశం కల్పిస్తూ బుధవారం ప్రకటనను విడుదల చేసింది. అయితే ఎమ్మెల్యే కోట ఎమ్మెల్సీ అభ్యర్థులుగా ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షులు బల్మూరి వెంకట్‌తో పాటు అద్దంకి దయాసాగర్ పేర్లు ఖరారు అయినట్టు ప్రచారం జరిగింది. అయితే అధికారక ప్రకటనలో బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్ పేరు రావడంతో పార్టీ నిజామాబాద్ జిల్లా శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ అధిష్టానం సూచన మేరకు బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్ తన స్థానాన్ని త్యాగం చేసి మాజీ మంత్రి షబ్బీర్ అలీకి అవకాశం కల్పించారు. దీంతో అధిష్టానం ఆయనకు ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించింది. ఈనెల 18లోగా ఎమ్మెల్సీ అభ్యర్థులు నామినేషన్లు సమర్పించాల్సి ఉండగా 29న ఎన్నిక జరగనుంది. అదేరోజు ఫలితాలు వెలువడనున్నాయి. ఎమ్మెల్యేల సంఖ్యా బలం ఆధారంగా రెండు స్థానాలను కూడా హస్తం పార్టీ కైవసం చేసుకోనుంది. దీంతో పార్టీ ప్రకటించిన ఇద్దరు అభర్థులు కూడా ఎమ్మెల్సీగా ఎన్నికవ్వడం లాంఛనమే కానుంది.

పర్యాటక కేంద్రంగా చారిత్రక కట్టడం

- నాగన్న బావిని సందర్శించిన జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్


పనులు పరిశీలిస్తున్న కలెక్టర్, అధికారులు

నవతెలంగాణ-లింగంపేట్

చారిత్రక కట్టడమైన నాగన్న గారి బాయిని పర్యట కేంద్రంగా మారుస్తున్నట్టు జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. లింగంపేట్ మండల కేంద్రంలోని నాగన్న గారి బావిని బుధవారం కలెక్టర్ సందర్శించారు. బావిలో కొనసాగుతున్న పునరుద్ధరణ పనులను స్థానిక తహసిల్దార్ ఎంపీడీవోలతో కలిసి పరిశీలించారు. బావికి సంబంధించిన చుట్టూ ప్రాంగణాన్ని కొలిపిచ్చి సరిహద్దులను వేయించారు. బావి పునరుద్ధరణ పనులు కూడా చాలావరకు పూర్తయినట్లుగా తెలిపారు. నాగన్న గారి బాయి సమీపంలోని పట్టేదారు మనోహర్ రావు తన సొంత భూమి నుండి 18 గంటల భూమిని నాగన్న గారి బాయికి అప్పగించారు. పురావస్తు శాఖ స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి చారిత్రక కట్టడమైనటువంటి నాగన్న గారి భాయి పునర్నిర్మాణం పనులు చేపడుతున్నట్టు తెలిపారు. పర్యాటకులు ఆకర్షించే విధంగా రూపకల్పన చేస్తున్నట్టు తెలిపారు. జిల్లాలో నాగన్న గారి భాయి ప్రత్యేక విశిష్టత ఉంటుంద న్నారు. త్వరలో నాగన్న బావిని పర్యాటక కేంద్రంగా రూపుదిద్దుకోబోతుందని అన్నారు. ఆయన వెంట తాసిల్దార్ సుధాకర్, ఎంపీడీవో మల్లికార్జున్ రెడ్డి, లింగంపేట ఎస్సై ప్రభాకర్, ఎంపీఓ ప్రభాకర్ చారి, సర్వేయర్ మౌనిక, అభిలాష్, ఆర్ఐ బాలయ్య, వివిధ గ్రామాల పంచాయతీ సెక్రటరీలు రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఎత్తిపోతల పథకం పంపు ప్రారంభం

- నవతెలంగాణ కథనానికి స్పందన

నవతెలంగాణ-బోధన్


లిఫ్ట్ స్విచ్‌ఆన్ చేస్తున్న సొసైటీ చైర్మన్ పల్లె జనార్ధన్


నీటిని ఎత్తిపోతను పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

సాలూర మండలంలో గత కొన్ని నెలల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తిపోతల పథకానికి సంబంధించిన ట్రాన్స్ ఫార్మర్‌ను ధ్వంసం చేసి అందులోని కాయిల్స్, ఆయిల్‌ను దొంగిలించారు. దాంతో ఎత్తిపోతల పథకం పంపు మూగబోయింది. ప్రస్తుతం యాసంగి సీజన్ ప్రారంభం కావడంతో రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు పడే పరిస్థితి తలెత్తింది. దాంతో రైతుల ఇబ్బందులు గమనించిన నవతెలంగాణ డిసెంబర్ 27న 'మరమ్మతులకు నోచుకోని ట్రాన్స్‌ఫార్మర్' అంటూ కథనం ప్రచురించింది. ఈ విషయం బోధన ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి దృష్టికి వెళ్లడంతో ఆయన స్పందించి ప్రభుత్వం ద్వారా ఐదు లక్షల పైగా నిధులు మంజూరి చేయించి ట్రాన్స్ ఫార్మర్ ను మరమ్మతులు చేయించారు. గత నాలుగు రోజుల క్రితం ట్రాన్స్ ఫార్మర్ ఎత్తిపోతల పంప్ హౌజ్‌కు చేరడంతో రైతులు దాన్ని బిగించారు. ఎత్తిపోతల పథకం మోటార్లను పరిశీలించిన కమిటీ ప్రతినిధులు బుధవారం లిఫ్టును ప్రారంభించి రైతులకు సాగునీటిని విడుదల చేశారు. దాంతో లిఫ్టు పరిధి కింద సుమారు 1600 ఎకరాల పంటలకు సాగునీరు అందే అవకాశం కలిగింది. రైతుల ఇబ్బందులను గ్రహించి కథనం ప్రచురించిన నవతెలంగాణకు, సాగునీరు అందేలా ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేయించి సహకరించిన బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరు సుదర్శన్ రెడ్డికి , లిఫ్ట్ ఇరిగేషన్ కమిటీ ప్రతినిధులకు, గ్రామ పెద్దలకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ అల్లె జనార్ధన్, లిఫ్ట్ కమిటీ ప్రతినిధులు సురేష్, నాగరాజు, సాయిలు, అల్లె రమేష్, కన్నె భీమయ్య, బుద్దె లక్ష్మణ్ , సొక్కం రవి, రావుల లక్ష్మణ్ పాల్గొన్నారు.

24 గంటలూ మిల్లుల్లో బియ్యం మరాడించాలి

- ఈ నెలాఖరులోగా పెండింగ్ ఉన్న సీఎంఆర్‌ను అందజేయాలి
- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి


మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

గత ఖరీఫ్ 2022-23 కు సంబంధించి పెండింగ్ ఉన్న సిఎంఆర్‌ను ఈ నెలాఖరులోగా ఎఫ్‌సిఐకి అందజేయాల్సి ఉందని, కావున రైస్ మిల్లర్లు ప్రణాళికాబద్ధంగా 24 గంటలు మిల్లులలో బియ్యాన్ని మరాడించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. బుధవారం కలెక్టరేట్ లోని ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ చంద్ర మోహన్ తో కలిసి 62 బాయిల్డ్ అండ్ రా రైస్ రైస్ మిల్లర్లతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గత ఖరీఫ్‌కు సంబంధించి ఇంకను 50 వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని భారత ఆహార సంస్థకు అప్పగించాల్సి ఉందని, ఎట్టి పరిస్థితులలో గడవు పొడగింపు ఉండదని, మిల్లర్లు ఈ పది రోజులు మిల్లుల ను 24 గంటలు పనిచేసే విధంగా చూడాలని అన్నారు. లక్ష్యాన్ని అధిగమించని మిల్లర్లకు 125 శాతం పెనాల్టీ విధంచడంతో పాటు వచ్చే సీజనులో ధాన్యం కేటాయించబోమని స్పష్టం చేశారు. జుక్కల్ నియోజకవర్గంలో 39 రైస్ మిల్లర్లు లక్ష్య సాధనలో చాలా వెనుకబడి ఉన్నారని, బియ్యాన్ని మరాడించి ఎఫ్.సి.కి. తరలించడంలో పోటీపడాలని, లక్ష్యాన్ని అధిగమించి చిన్న చిన్న మిల్లర్ల పరస్పర సహకారంతో లక్ష్యాన్ని చేరుకోవాలని అన్నారు. జిల్లాలో రోజు 4,221 మెట్రిక్ టన్నుల ధాన్యం మరాడించుటకు అవకాశమున్నా అలసత్వం కారణంగా రాష్ట్రంలో చాలా వెనుకబడి ఉన్నామని, రాష్ట్ర స్థాయి బృందాలు జిల్లాలో పర్యటించే అవకాశముందని అన్నారు. సామర్థ్యం మేరకు మిల్లులను నడపడం ద్వారా రైతులకు మేలు జరగడంతో పాటు మిల్లర్లు లాభపడ తారని అన్నారు. జిల్లా యంత్రాంగం తరపున పూర్తి సహకారమందిస్తామని, కుంటిసాకులు చెప్పకుండా లక్ష్యాన్ని 10 రోజులల్లో చేరుకునేలా ప్రణాళికా బద్ధంగా రోజు ధాన్యాన్ని ఎఫ్.సి.ఐ. కి తరలించాలని అన్నారు. నాలుగు రోజుల తరువాత తిరిగి సమీక్షిస్తానని పూర్తిగా డెలివరీ చేస్తామని నమ్మకాని కలిగించాలని లేనిపక్షంలో రెడ్ జోన్‌లో పెడతామని హెచ్చరిం చారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లికార్జున్ బాబు, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ అభిషేక్ సింగ్, జిల్లా రైస్ మిల్లుల సోసియేషన్ అధ్యక్షులు కంచర్ల లింగం, సహాయ పౌర సరఫరాల అధికారి నిత్యానందం, రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రజల ముంగిట్లో సంక్షేమ పథకాలు

- ఎంపీ అరవింద్

నవతెలంగాణ-మాక్లూర్

వివిధ వర్గాల అభ్యున్నతి కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గ్రామీణ ప్రజల ముంగిట్లోకి తీసుకొచ్చినట్టు నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్ అన్నారు. నిజామాబాద్ జిల్లా, మాక్లూర్ మండలం, అమ్రాద్ తండాలో బుధవారం నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమానికి ఎంపి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరూ కేంద్ర పథకాల గురించి అవగాహన పెంపొందించుకుని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం గ్రామగ్రామాన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహిస్తోందని స్పష్టం చేశారు. క్యాలెండర్ పై ఉన్న క్యూఆర్ కోడ్ ను సెల్ ఫోన్ ద్వారా స్కానింగ్ చేస్తే కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్నీ మీకు తెలిసిపోతాయని, ఆ సదుపాయాన్ని ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని సూచించారు

ఎన్ని ఇబ్బందులున్నా...

రైతు డిక్లరేషన్ అమలుచేస్తాం

- ఈ నెలాఖరులోపు రైతుబంధు జమ
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- ఆంధ్రానగర్‌లో ఎన్టీఆర్ విగ్రహం ఆవిష్కరణ

నవతెలంగాణ-నందిపేట్/డిచ్‌పల్లి


విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి

ఎన్ని ఇబ్బందులు ఎదురైనా సరే, రైతు డిక్లరేషన్ ను అమలు చేసి తీరుతామని రాష్ట్ర వ్యవసాయ, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, రైతాంగ ప్రయోజనాలే పరమావధిగా పని చేస్తామని అన్నారు. నిజామాబాద్ జిల్లా నందిపేట్ మండలం ఆంధ్రానగర్‌లో ఏర్పాటు చేసిన నందమూరి తారకరామారావు విగ్రహాన్ని బుధవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా విచ్చేసి ఆవిష్కరించారు. ముందుగా డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి) గ్రామానికి చేరుకున్న మంత్రి తుమ్మలను బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్ రెడ్డి, మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, అదనపు కలెక్టర్ పి.యాదిరెడ్డి తదితరులు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. అనంతరం ఆంధ్రానగర్‌లో ఎన్టీఆర్ విగ్రహాన్ని అట్టహాసపు ఏర్పాట్ల నడుమ మంత్రి ఆవిష్కరించారు.

వివరాలు మెయిన్‌లో..

లిఫ్ట్‌లో ఇరుక్కున్న సెక్యూరిటీ గార్డ్

- గంటన్నర పాటు నరకయాతన
- నిజామాబాద్‌లోని హెచ్‌డీఎఫ్‌సీలో ఘటన
- ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స దొరకక.. ప్రయివేటుకు తరలింపు



నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్రమాద వశాత్తు సెక్యూరిటీ గార్డు లిఫ్టులో ఇరుక్కున్నాడు. కాళ్లు బయట, దేహం లిఫ్టు లోపల ఉండటంతో సుమారు గంటన్నర పాటు నరకయాతన అనుభవించాడు. ఫైర్ రెస్క్యూ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టి ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన నిజామాబాద్ నగరంలోని కోటగల్లిలో గల లావణ్య అక్రేడ్ షాపింగ్ కాంప్లెక్స్‌లోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. సదరు షాపింగ్ కాంప్లెక్స్‌లో హెచ్‌డీఎఫ్‌సీ హౌసింగ్ లోన్ బ్యాంక్‌లో మహేందర్‌గౌడ్ సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. ఉదయం 8.30 గంటల సమయంలో వాష్ రూమ్ కోసం లిఫ్ట్‌లో వెళ్లి తిరిగి వస్తుండగా గ్రౌండ్ ఫ్లోర్‌లో దిగే క్రమంలో మధ్యలో లిఫ్టు ఆగిపోయింది.

వివరాలు మెయిన్‌లో..

మాజీ ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలి

- సిపిఐ డివిజన్ కార్యదర్శి ఆరేపల్లి సాయిలు

నవతెలంగాణ-ఆర్మూర్

ఓటమిని జీర్ణించుకోలేని మాజీ ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి,, ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డిపై ఆయన కుటుంబం టీవీ చానెల్ లో మాట్లాడుతూ వ్యక్తి గతంగా మాట్లాడడం సబబు కాదని సీపీఐ డివిజన్ కార్యదర్శి అరేపల్లి సాయిలు బుధవారం ఒక ప్రకటనో తీవ్రంగా ఖండించారు. గెలుపోటములు ప్రజలు నిర్ణయిస్తే శిరస్సు వంచి స్వాగతించాలని పేర్కొన్నారు. తమ రాజకీయ స్వార్థం కోసం పైడి రాకేష్ రెడ్డి కుటుంబం గురించి మాట్లాడే అర్హత జీవన్ రెడ్డికి ఎవరిచ్చారని జెండాలు పక్కన బెట్టి ఆర్మూర్ నియోజక వర్గ అభివృద్ధి కోసం పాటు పడాలని తెలిపారు. తక్షణమే జీవన్ రెడ్డి పైడి రాకేష్ రెడ్డి తో పాటు అంకాపూర్ విలేజ్ డెవలప్ మెంట్ కమిటీకి బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన కోరారు.

యువతి అదృశ్యం

- కేసు నమోదు చేసిన పోలీసులు



నవతెలంగాణ-ధర్పల్లి

మండల కేంద్రానికి చెందిన కోదండం సంతోషి (18) బుధవారం ఉదయం 5 గంటల ప్రాంతంలో గుడికి వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లినట్లు కుటుంబీకులు తెలిపారు. తిరిగి ఇంటికి రాకపోవడంతో చుట్టు పక్కల, బంధువుల ఇండ్లల్లో వెతికినా జాడ తెలియలేదు. దీంతో అమ్మాయి తల్లి కోదండం సత్తెమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ వంశీ క్రిష్ణ రెడ్డి తెలిపారు. అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

గుంటూరు కారం సినిమాలోని విలన్ల పాత్రల పేర్లను తొలగించాలి



నవతెలంగాణ-సిరికొండ

మహేష్ బాబు నటించిన గుంటూరు కారం సినిమాలో విలన్స్ కు మార్క్స్, లెనిన్ పేర్లు పెట్టి వారి పాత్రలను చెడుగా చూపెట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఏఐకేఎంఎస్ ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి కారల్‌మార్క్స్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అసభ్యకరంగా రాసిన మడత కుర్చీ బూతు పాటని తక్షణమే సినిమాలో నుండి తొలగించాలని సినిమా డైరెక్టర్ త్రివిక్రమ్‌కు మతిభ్రమించిందని పేర్కొన్నారు. మతిస్థిమితం లేని వాడిలా రాసారని మార్క్స్ తెలిపారు. ప్రపంచ కమ్యూనిస్టు విప్లవకారులు మార్క్సిస్ట్ మహోపాధ్యాయుల పేర్లను ఈ సినిమాలో విలన్స్ కి పెట్టి సమాజానికి తప్పుడు అవగాహన కల్పించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు.కారల్ మార్క్స్ ప్రపంచానికి కమ్యూనిజాన్ని పరిచయం చేసిన వ్యక్తి అని, అలాంటి మహానుభావుల పేర్లని విలన్స్ కు పెట్టడంపై అభ్యంతరం వ్యక్తంచేశారు. డైరెక్టర్లు కమ్యూనిస్టు విప్లవ నాయకుల పేర్లని ఉపయోగించకుండా వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హీరో మహేష్ బాబు డైరెక్టర్ త్రివిక్రమ్ బహిరంగంగా క్షమాపణ చెప్పి పేర్లను తొలగించాలని డిమాండ్ చేశారు.

రక్తదానానికి మించింది మరోదానం లేదు

- రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ ఆంజనేయులు



రక్తదానం చేస్తున్న యువకులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

రక్తదానానికి మించింది మరొకటి లేదని రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ ఆంజనేయులు అన్నారు. మండలంలోని రాంపూర్ (డి) గ్రామంలో పబ్లిక్ పవర్ యూత్, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం రక్త దాన శిబిరం నిర్వహించారు. యువకులు భారీ ఎత్తున పాల్గొని రక్తదానం చేశారు.ఈ సందర్భంగా రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ ఆంజనేయులు, యూత్ అధ్యక్షులు బి. విజయ్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి రక్తం చుక్క కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, అన్ని దానాల కంటే రక్తదానం మహా గొప్పదని వారన్నారు. ప్రతి ఒక్కరూ మానవత దృక్పథంతో ముందుకు వచ్చి రక్తదానం చేయాలని కోరారు. గ్రామ యువకులు ముందుకు వచ్చి శిబిరం ఏర్పాటు చేయించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త పులి సాగర్, రెడ్ క్రాస్ సొసైటీ ట్రెజరర్ కర్నె రవిందర్, అమర్ బాబు, గంగాధర్, యూత్ సభ్యులు బి గంగాధర్, కే సుమన్, గంగారాం, ప్రశాంత్, నర్సాగౌడ్, చంద్రకాంత్, శేఖర్, సందీప్, రజనీకాంత్ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.25వేల విరాళం



ఆలయ నిర్మాణానికి విరాళం అందజేత

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలో నిర్మిస్తున్న నూతన అయ్యప్ప ఆలయానికి గ్రామానికి చెందిన సామ నరేష్, మౌనిక దంపతులు తమవంతు సహాయంగా రూ.25వేల విరాళం అందజేశారు. ఈ మేరకు బుధవారం విరాళం మొత్తాన్నివారి కుమారుల చేతుల మీదుగా ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు బద్దం రాజశేఖర్, సురంగి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఒకరికి పది రోజులు జైలు శిక్ష

నవతెలంగాణ-కంఠేశ్వర్

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఒకరికి పది రోజుల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి సయ్యద్ ఖదీర్ బుధవారం తీర్పు వెలువరించారు. రాజు అనే వ్యక్తి మద్యం తాగి బైకు నడిపి పోలీసులకు చిక్కాడు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో బుధవారం కోర్టులో ప్రవేశపెట్టారు. ఆయనకు న్యాయమూర్తి పది రోజుల పాటు జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. అలాగే మరో 22 కేసుల్లో రూ.26,500 జరిమానా విధించారు.

క్షత్రియ సమాజ్ క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-ఆర్మూర్

శ్రీ సోమవంశ సహస్రార్జున క్షత్రియ (ఖత్రి/పట్కర్) ప్రాంతీయ సమాజ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షులు, ఆర్టీసీ ముఖ్య కార్యనిర్వహణ అధికారి, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి డాక్టర్ విశ్వనాథ్ రవీందర్ అధ్యక్షతన 2024 క్యాలెండర్ బుధవారం ఆవిష్కరించారు. హైదరాబాద్‌లోని వెస్ట్ మారేడ్ పల్లిలో గల రాష్ట్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పట్టణానికి చెందిన నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశ్వనాథ్ రవీందర్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా క్షత్రియ సమాజ్ అభివృద్ధి, సంక్షేమంకోసం కృషి చేస్తూ మిషన్ ఉథాన్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా పేదరికం, నిరక్షరాస్యత రూపుమాపడానికి ప్రతి ఒక్కరు కంకణ బద్దులు కావాలని పిలుపు నిచ్చారు. క్షత్రియ కులస్తులు అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. కార్యక్రమంలో ప్రాంతీయ క్షత్రియ సమాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టంక్ విష్ణు, ఉపాధ్యక్షులు నాగూరావు నామాజీ, పూజారి రాజేశ్వర్, కోశాధికారి దినేష్ వైద్య, రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి ఖాందేష్ శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శులు విశ్వనాథ్ నర్సింహా రావు, గోరఖ్ శివ కుమార్, చవాన్ భరత్, డాక్టర్ ఆనంద్ రావు మెంగ్జి, సభ్యులు ఓంకార్ ప్రభు, కామేశ్వర్, టంక్ శ్యామ్ రావు, రాష్ట్ర యూత్ కమిటీ సలహాదారులు విశ్వనాథ్ బాల్ రాజ్ పాల్గొన్నారు.

విప్లవ పార్టీల ఐక్యతతో ఉద్యమ నిర్మాణానికి పూనుకుందాం

- సీపీఐ(ఎంఎల్)ప్రజాపంథా

నవతెలంగాణ-సిరికొండ

విప్లవ పార్టీల ఐక్యతతో ఉద్యమ నిర్మాణానికి పూనుకుందామని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కమిటీ సభ్యులు పి.రామకృష్ణ పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని గడ్కోల్ గ్రామంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈసందర్భంగా ఖమ్మంలో మార్చ్ 3,4,5 తేదీల్లో జరగనున్న పీసీసీ సీపీఐఎంఎల్, సీపీఐఎంఎల్ ప్రజాపంథా, సీపీఐఎంఎల్ రివల్యూషనరీ ఇన్షియేటివ్ పార్టీల విలీనం సందర్భంగా



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

జాతీయ మహాసభల కరపత్రాలు గడ్కోల్‌లో పంపిణి చేస్తూ విస్తృత ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కమిటీ సభ్యులు పి. రామకృష్ణ మాట్లాడుతూ.. దేశంలో విప్లవ శక్తులు ఏకం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఒకవైపు మతోన్మాదం, సామ్రాజ్యవాదులతో ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయని విప్లవ శక్తులు ఒకే గొంతుగా గర్జించాల్సిన సమయం ఏర్పడిందని తెలిపారు. రెండేళ్లుగా ఐక్యత చర్చలు జరిపి మూడు విప్లవ పార్టీలు విలీనం అవుతున్నాయని అన్నారు. ఈ విప్లవ పార్టీల విలీనం స్ఫూర్తితో బలమైన విప్లవ ఉద్యమ నిర్మాణానికి పూనుకోవాలన్నారు. మతం పునాదిగా ఏర్పడిన బిజెపి రాజకీయాల్లోకి దేవుడిని లాగి లబ్ధి పొందాలని కుట్ర పూరిత రాజకీయాలకు పూనుకుంటుందని తెలిపారు. విప్లవ పార్టీలు మారుతున్న స్థితిగతులకు అనుగుణంగా తమ పార్టీల సిద్ధాంతాలను మార్చుకుంటేనే భవిష్యత్తులో పురోగతి సాధిస్తాయని గ్రహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా పందా ఆర్మూర్ డివిజన్ సహాయ కార్యదర్శి ఆర్ రమేష్, నాయకులు బి బా బన్న, ఏం లింబాద్రి, ఎం నారా గౌడ్, ఇ రమేష్ బి కిషోర్, అనీష్, ఎం సాయా రెడ్డి, ఎస్ కిషోర్, బట్టు సర్పంచ్, తదితరులు పాల్గొన్నారు.

లిఫ్ట్ ఇరిగేషన్ పనులను పూర్తిచేయాలి

- 132 కె.వి సబ్ స్టేషన్‌ను మంజూరు చేయించాలి
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రికి వినతి

నవ తెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని మునిపల్లి గ్రామానికి మంజూరైన లిఫ్టు ఇరిగేషన్ పనులను తొందర్లోనే పూర్తిచేయాలని, జక్రాన్ పల్లి మండలానికి 132 కెవి సబ్ స్టేషన్‌ను మంజూరు చేయించాలని రాష్ట్ర వ్యవసాయ, మరియు సహ కార శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వరరావుకు వినతి పత్రం సమర్పించినట్లు మాజీ ఎంపీపీ అనంత్ రెడ్డి తెలిపారు. బుధవారం నిజామాబాద్ జిల్లాలో రాష్ట్ర వ్యవసాయ, సహకార మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పర్యటనలో భాగంగా మండవ వెంకటేశ్వరరావు సమక్షంలో జక్రాన్‌పల్లి మాజీ ఎంపీపీ సభ్యులు అనంత రెడ్డి మండల అభివృద్ధికోసం వినతి పత్రం సమర్పించారు. అనంతరం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాజీ ఎంపీపీ అనంత్ రెడ్డి శాలువాతో ఘనంగా సన్మానించారు.

కార్యక్రమంలో మునిపల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు పోగుల భాస్కర్, క్యాతం రాజరెడ్డి, టంకశాల నరేష్, క్యాతం భూమా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ప్లాట్లలో పిచ్చి మొక్కల తొలగింపు



మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-సిరికొండ

మండల కేంద్రంలో రూరల్ ఎమ్మెల్యే రేకులపల్లి భూపతి రెడ్డి ఆదేశాల మేరకు ఇందిరమ్మ ప్లాట్లలోని పిచ్చి మొక్కలను జేసీబీ సహాయంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు దేగం సంజీవ్ సహకారంతో తొలగించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో అధికారం లో ఉన్నప్పుడు కాంగ్రెస్ పార్టీ ఇందిరమ్మ ప్లాట్ల లబ్ధిదారు లకు మంజూరు పత్రాన్ని ఇచ్చిందన్నారు. అనంతరం అధికారంలోకి వచ్చిన బిఆర్ఎస్ ప్రభుత్వం ఇందిరమ్మ ప్లాట్లను లబ్దిదారులకు కేటాయించడంలో నిర్లక్ష్యం వహించిందని తెలిపారు. సొంత ఇంటి కలను కలలాగే మిగిల్చిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ఇందిరమ్మ ప్లాట్ల సమస్యను పరిష్కరించాలని కాంగ్రెస్ నాయకులు పట్టు పట్టడంతో రూరల్ ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ప్లాట్లలోని పిచ్చి మొక్కలను తొలగించి చదును చేస్తున్నట్లు వారు వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇచ్చిన ఇందిరమ్మ ప్లాట్లు మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పరిష్కారం కావడం పట్ల లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో దేగం సంజీవ్, దిగంబర్ , శోభన్, ఆసిఫ్, మహేష్ రెడ్డి, తెనుగు జలంధర్ పాల్గొన్నారు.

మేము సైతం



నవతెలంగాణ-సిరికొండ

అయోధ్య రామ మందిరం బలరాముని ప్రాణ ప్రతిష్ట కార్యక్రమంలో మేము సైతం అంటూ సిరికొండ గ్రామానికి చెందిన మైనార్టీ సోదరులు కమిటీ తరఫున అన్నదాన కార్యక్రమానికి తమ వంతు సహాయంగా 5100 నగదును విరాళంగా అందజేశారు. జనవరి 22న అయోధ్యలో విగ్రహ ప్రతిస్థాపన రామ మందిర ప్రారంభోత్సవం ఉన్నందున ఆరోజున సిరికొండ గ్రామంలో జరగనున్న అన్నదాన కార్యక్రమానికి మైనారిటీ సోదరులు విరాళాలు అందించి దానిలో పాల్గొంటామని వెల్లడించారు. సిరికొండ గ్రామానికి చెందిన మైనార్టీ సోదరులు కుటుంబ సమేతంగా కార్యక్రమంలో పాల్గొని బలరాముని ఆశీర్వాదం తీసుకొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆలయ కమిటీ వారు కోరారు కార్యక్రమంలో సలాం చావుస్ అధ్యక్షుడు, మహమ్మద్ సలా ఉద్దిన్, జావీద్, సలీమ్ గాజుల, మతీన్ గాజుల, సలీం, అసద్ బిన్ ఆమెర్, మోసిన్, యూనస్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే తండాల అభివృద్ధి

- రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి
- కాంగ్రెస్ పార్టీలో సర్పంచ్‌తోపాటు మరికొందరు చేరిక

నవతెలంగాణ-ధర్పల్లి



పార్టీ కండువాలు వేస్తున్న ఎంఎల్ఏ భూపతిరెడ్డి

మండలంలోని గుడి తండా సర్పంచ్ లింబియా నాయక్‌తోపాటు తండాకు చెందిన పలువురు నాయకులు బుధవారం రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ వీడి కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోని గిరిపుత్రులు నివసించే ప్రతి తండాను అభివృద్ధి చేసి వారు ఎదిగేందుకు ఎన్నో పథకాలను ప్రవేశ పెట్టి వారికి అందించిన ఘనత కాంగ్రెసుదే నని అన్నారు. ఇందిరమ్మ హయాంలో గిరిజనులకు బతుకు దెరువు కొరకు భూములు ఇచ్చి, వాటికీ సాగుకు కావలసిన ఆర్థిక సహాయంతోపాటు నీటి సౌకర్యంకోసం బోరు బావులను, పంపు సెట్లను అందించి ఆదుకున్నారని అన్నారు. వారి పిల్లలకు విద్యలో రిజర్వేషన్ అందించి సమాజంలో తలెత్తుకొని బతికేలా చేసిన ఘనత కాంగ్రెసుదే అనిఅన్నారు. అందుకే రాష్ట్ర ప్రజలు దొరల రాజ్యాన్ని కాదని , ఇందిరమ్మ రాజ్యాన్ని కోరుకున్నారని అన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కలిసి కట్టుగా పని చేసి పార్లమెంట్ స్థానాన్ని సోనియమ్మకు బహుమతిగా అందించేందుకు ప్రణాళికతో ముందుకు వెళ్ళవలసిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. కాంగ్రెస్ కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందుకు రాకుండా పార్టీ కడుపులో పెట్టుకొని చూసుకుంటుందని అన్నారు. సర్పంచ్‌తోపాటు బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు రమేష్, నాయకులు మోతిరాం, మాగిత్యా లక్ష్మణ్, రాజు, బలరాం, సంతోష్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే పార్టీ ఖండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఆర్మూర్ చిన్న బాలరాజ్, పార్టీ సీనియర్ నాయకుడు జెసిబి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మంచిప్పలో మండల స్థాయి వాలీబాల్ పోటీలు



ఎస్సై మల్లేష్‌ను సన్మానిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని మంచిప్ప గ్రామంలో జై భారత్ యూత్ అధ్యక్షులు నాయుడు సాయిరాం ఆధ్వర్యంలో మండల స్థాయి వాలీబాల్ పోటీలు బుధవారం నిర్వహించారు. ఈ పోటీలకు ముఖ్యఅతిథిగా విచ్చేస్తున్న ఎక్సైజ్ ఎస్సై మల్లేష్ మాట్లాడుతూ.. నేటి యువత మత్తు మాదకద్రవ్యాలకు బానిసలై తమ అమూల్యమైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. స్వామి వివేకానంద సూచించిన బాటలో నడుస్తూ వారిచ్చిన ప్రసంగాలు సూక్తులను మననం చేసుకుంటూ తమ భవిష్యత్తును సక్రమంగా మల్చుకోవాల్సిన బాధ్యత యువతపై ఉందని అన్నారు. ఇలాంటి ఆటల పోటీలు మానసిక, శారీరక దృఢత్వానికి ఎంతో ఉపయోగపడతాయన్నారు. గ్రామాల్లో ఎవరైనా గంజాయి కానీ మాదకద్రవ్యాలు అమ్మే వారు ఉంటే తెలపాలని కోరారు. 20 సంవత్సరాల నుండి వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్న జై భారత్ యువజన సంఘానికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సిద్ధార్థ, ఉప సర్పంచ్ జగదీష్, మాజీ ఎంపీటీసీ వెంకట్రాం నాయక్, యూత్ అధ్యక్షులు నాయుడు సాయిరాం, విడిసి అధ్యక్షులు గోపూర్ నరేష్ రెడ్డి, దేవేందర్, గంగాప్రసాద్, మంచిప్ప, సేవాలాల్, తండా, బాడ్సి, ముదక్‌పల్లీ గ్రామాల యువకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

2024-25 యాక్షన్ ప్లాన్‌పై గ్రామసభ



మాట్లాడుతున్న అధికారులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

జాతీయస్థాయి ప్రజా ప్రణాళిక 2024-25 ఆర్థిక సంవత్సరంలో యాక్షన్ ప్లాన్‌ను తయారు చేయడానికి గ్రామ సభను ఏర్పాటు చేసినట్లు గ్రామపంచాయతీ కార్యదర్శి, నోడల్ అధికారి శ్రీధర్ అన్నారు. బుధవారం ఇందల్‌వాయి మండల కేంద్రంలోని తిర్మన్ పల్లి గ్రామ పంచాయతీలో జాతీయస్థాయి ప్రజా ప్రణాళిక ప్రకారం చేపట్టవలసిన పనులపై గ్రామస్తులతో చర్చించి పనులను గుర్తించడం జరిగిందన్నారు. దానిలో భాగంగా చేపట్టవలసిన పనులపై ప్రజలనుంచి వచ్చిన విజ్ఞప్తుల అనుసారం ఉన్నతాధికారులకు నివేదికను సమర్పించి వచ్చే2024- 25లో గ్రామంలో పనులు చేపట్టడానికి ఏకగ్రీవంగా చర్చించి తీర్మానం చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ చింతల దాస్ , మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ హుస్సేన్, గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ గోపు గోవర్ధన్‌తోపాటు శాఖలకు చెందిన అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లు స్పెషల్ క్యాంపనింగ్ డేస్‌ని వినియోగించుకోవాలి

- తహసీల్దార్ ఆంజనేయులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



మాట్లాడుతన్న తహసీల్దార్ అంజేయులు

ఓటర్లు స్పెషల్ క్యాంపనింగ్ డేస్‌ని వినియోగించుకోవాలని తహసిల్దార్ ఆంజనేయులు కోరారు. బుధవారం మండలకేంద్రంలోని రైతు వేదిక భవనంలో నిర్వహించిన బూత్ లెవల్ అధికారుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రానున్న ఓటర్ స్పెషల్ క్యాంపెనింగ్ డేస్‌కి సంబంధించిన వివరాలపై బూత్‌లెవల్ అధికారులకు అవగాహన కల్పించారు. ఈ నెల 20, 21 తేదీల్లో అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 10గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు బూత్ లెవల్ అధికారులు అందుబాటులో ఉండాలని అన్నారు. కొత్తగా ఓటర్లు నమోదు చేసుకునే వారి కోసం ఫారం నెంబర్-6, ఓటర్ కార్డులో ఏదైనా తప్పులు దొర్లితే దాన్ని సరిదిద్దుకొనుటకు ఫారం నెంబర్-8, ఎవరైనా మరణించిన, శాశ్వతంగా షిప్టు అయిన వారి కోసం ఫారం-7ని అప్లై చేయించాలని సూచించారు. కొత్తగా 18 సంవత్సరాలు నిండిన ఓటరు ఎవరైనా ఉంటే వారికి ఓటు హక్కు గురుంచి అవగాహన కల్పించి వారితో ఫారం నెంబర్-6 కి దరఖాస్తు చేయించాలని తెలిపారు. ఏ రోజు దరఖాస్తులను ఆ రోజే ఆన్ లైన్ చేయాలని సూచించారు. ఈ రెండు రోజులపాటు బూత్ లెవల్ అధికారులు ఎవరు సెలవు పెట్టకుండా సంబంధిత అధికారులు చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది డిప్యూటీ తహసిల్దార్ భాస్కర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శరత్, సీనియర్ అసిస్టెంట్ కిరణ్, మండల బూత్ లెవల్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, కారో బార్లు, తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి

- సీపీఐ(ఎం)

నవతెలంగాణ-ఆర్మూర్

బస్టాండ్ డ్రైనేజ్ సమస్య పరిష్కరించాలని సిపిఐ(ఎం) పట్టణ అధ్యక్షులు కూతాడి ఎల్లయ్య అన్నారు.. ఈ సందర్భంగా బుధవారం డిపో మేనేజర్ కు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ... బస్టాండ్ దగ్గరలో ఉన్న శ్రీదేవి మెడికల్ బిల్డింగ్‌లో ఉంటున్న కిరాయి వాళ్ల వాడిన మురికి వాటర్ లీకై బస్టాండ్‌లోనికి వెళ్తున్న ఆర్మూర్ మున్సిపల్ అధికారులు చూడనట్లు ఉంటున్నారని అన్నారు. దీని కారణంగా బస్టాండుకు వస్తున్న బస్సులు, ప్రజలకు ఇబ్బందికరంగా మారిందన్నారు. ఈ మురికి వాటర్ రోడ్డు ఇరువైపులా పండ్లు అమ్ముకునే షెల్టర్లకి రావడంతో పండ్ల వ్యాపారులు



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఆ పండ్లపై ఈగలు దోమలు వాలిన పండ్లను ప్రజలు కొంటున్నారని, బస్టాండ్ చుట్టుపక్కల ఉన్న హెూటల్లో ప్రజలు టిఫిన్స్ చేసి అనారోగ్యాలకు గురవుతున్న అధికారులు మాత్రం నీమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం సిగ్గుచేటని అన్నారు. తక్షణమే శ్రీదేవి కాంప్లెక్స్ డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని, ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని ఆర్మూర్ బస్టాండ్ చుట్టుపక్కల ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆర్టీసీ ఎదుట కార్మికులతో ఆందోళనా కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఏఐకేఎస్ జిల్లా ఉపాధ్యక్షులు తోగాటి భూమన్న, సిద్దాల నాగరాజు, చెరుకు నారాయణ, లిఓంకార్, ఫిరోజ్ ఖాన్, జి కిషన్, గంగా నర్సయ్య, వెంకటేష్, నరేందర్, నదీమ్ బాయ్, దీపేందర్ తదితరులు పాల్గొన్నారు.

చిత్ర నిర్మాణ బృందం క్షమాపణ చెప్పాలి

నవతెలంగాణ-భీంగల్

మహేష్ బాబు కథానాయకుడిగా విడుదలైన గుంటూరు కారం సినిమాలో విలన్స్‌కు మార్క్స్, లెనిన్ పేర్లు పెట్టి వారి పాత్రలను చెడుగా చూపెట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని పిడిఎస్‌యూ భీమ్ గల్ మండల కన్వీనర్ ఎం. నరసింహ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సినిమా డైరెక్టర్ త్రివిక్రమ్‌కు మతి భ్రమించి ప్రపంచ కమ్యూనిస్ట్ విప్లవ కారులు, మార్క్సిస్ట్ మహోపాధ్యాయుల పేర్లను ఈ సినిమాలో విలన్స్ కి పెట్టి సమాజానికి తప్పుడు అవగాహన కల్పించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. శ్రామిక వర్గ సిద్ధాంతం "దాస్ కాపిటల్ " రచించి ప్రపంచవ్యాప్తంగా శ్రామిక వర్గాన్ని విముక్తి చేయడానికి తన జీవితాన్ని ధారపోశారని తెలిపారు. మహానేతల పేర్లని విలన్స్‌కు పెట్టిన చిత్ర నిర్మాణ బృందం బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

పుల్కల్ సొసైటీ చైర్మన్‌గా రామకృష్ణరెడ్డి

నవతెలంగాణ-బిచ్కుంద

మండలంలోని పుల్కల్ రైతు సహకార సంఘంలో నిర్వహించిన అధ్యక్ష ఎన్నికల్లో తొమ్మిది మంది డైరెక్టర్లు చైర్మన్‌గా రామకృష్ణరెడ్డిని ఎన్నుకున్నారు. ఎన్నికల ప్రక్రియ పరిశీలనా అధికారిగా రమేష్ నిర్వహించారు. నూతనంగా ఎన్నికైన రామకృష్ణరెడ్డికి సభ్యులు రైతుల సమక్షంలో ప్రమాణం చేయించి ఎన్నిక పత్రాన్ని అందజేశారు. రైతు సహకార సంఘం అభివృద్ధికి తాను కృషి చేస్తానని రైతులకు అందుబాటులో ఉండి విత్తనాలు ఎరువులు సమయానికి అందజేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్టర్ పిట్లం క్లస్టర్ అధికారి మురళిగౌడ్, జూనియర్ ఇన్‌స్పెక్టర్ అబ్దుల్ అలీమ్, కార్యదర్శి సాయి ప్రకాష్, రైతులు, డైరెక్టర్లు ఉన్నారు.



ప్రమాణస్వీకారం చేస్తున్న రామకృష్ణరెడ్డి

పోగొట్టుకున్న ఫోన్ అందజేత

నవతెలంగాణ-జుక్కల్

పోగొట్టుకున్న ఫోన్‌ను పోలీసులు వెతికి పట్టుకుని బాధితుడికి అందజేశారు. జుక్కల్ ఎస్సై సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. జుక్కల్ మండల కేంద్రానికి చెందిన సచిన్ అనే యువకుడు 18-8-2023లో వన్‌ప్లస్ మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. సీఐఈఆర్ డాటా షాప్ ఎంట్రీ ప్రకారం పోయిన ఫోన్‌ను ట్రేస్ చేసి పోలీసులు పట్టుకున్నారు. అనంతరం ఆ ఫోన్‌ను బాధితుడికి అందజేశారు.



బాధితుడికి ఫోన్ అందజేస్తున్న ఎస్సై సత్యానారాయణ

కరోనా పట్ల జాగ్రత్త

- జిల్లా వైద్యాధికారి డాక్టర్ లక్ష్మణ్ సింగ్
- ప్రభుత్వాస్పత్రి పరిశీలన



ఆస్పత్రిని పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి

నవతెలంగాణ-భిక్కనూర్

కరోనా పట్ల జాగ్రత్తగా ఉండాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ లక్ష్మణ్ సింగ్ తెలిపారు. బుధవారం పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి డాక్టర్ లక్ష్మణ్ సింగ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కరోనా వ్యాధి మళ్లీ వ్యాప్తి చెందుతున్నందున గ్రామాలలో ప్రజలకు కరోనా వ్యాధి రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించాలని సూచించారు. అలాగే ఆస్పత్రిలో కోవిడ్ టెస్ట్‌కిట్స్, ఆక్సిజన్ సిలిండర్స్, సరైన వైద్య సదుపాయాలను పరిశీలించి, అందుబాటులో ఉండే విధంగా చూడాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు యేమిమా, ఆదర్శ, కంటి వైద్యాధికారి లింబాద్రి, హెచ్‌ఈఓ వెంకటరమణ, ల్యాబ్ టెక్నీషియన్ లతీఫ్, ఫార్మసిస్ట్ వెంకటేశ్వర్లు, ఆరోగ్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఈ కేవైసీ పేర వసూళ్లు

- ట్రాన్స్‌ఫర్ రుసుం సైతం అధికం
- వినియోగదారులను బురిడీ కొట్టిస్తున్న గ్యాస్ ఏజెన్సీలు
- ఆయిల్ కంపెనీల ఆదేశాలు పట్టించుకోని వైనం



గ్యాస్ ఏజెన్సీ

నవతెలంగాణ-నిజాంసాగర్

గ్యాస్ ఏజెన్సీలు వినియోగదారులను బురిడీ కొట్టిస్తున్నాయి. ప్రతి వినియోగదారుడు ఈ కేవైసీ చేయించుకోవాలని ఇంటింటికీ తిరుగుతూ.. వసూళ్లకు పాల్పడుతున్నారు. దీంతో పాటు గ్యాస్ కనెక్షన్ గల వ్యక్తి మరణిస్తే దానిని ఇతరుల పేరుపై మార్చేందుకు ఉన్న రుసుం కంటే అదనంగా వసూలు చేస్తున్నారు. రూ.500కే గ్యాస్ సిలిండర్ పంపిణీకి.. ఈకేవైసీ సంబంధం లేదని అధికారులు చెబుతున్నా.. గ్యాస్ ఏజెన్సీలు మాత్రం వినియోగదారులనుంచి డబ్బులు వసూలు చేస్తున్నారు.

మండల కేంద్రంలోని సుల్తాన్‌నగర్ గ్రామంలో హెచ్‌పి వీరభద్ర గ్యాస్ ఏజెన్సీ ప్రజల దగ్గర భారీగా డబ్బులు దోచుకుంటుంది. సామాన్య ప్రజలు తమ పరిస్థితిని ఎవరికి చెప్పాలో తెలియక సతమతమవుతున్నారు. నూతనంగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీమేరకు రూ.500కే గ్యాస్ సిలిండర్ అందిస్తామని హామీనిచ్చిన విషయం తెలిసిందే. అందులో భాగంగా ఆరుగ్యారంటీలను అమలు చేసేందుకు గానూ ఇటీవలే ప్రజాపాలన నిర్వహించి దరఖాస్తులను సైతం స్వీకరించింది. అయితే దీనిని ఆసరాగా చేసుకున్న గ్యాస్ ఏజెన్సీలు ప్రతి గ్రామంలోని గ్యాస్ వినియోగదారుల వద్దకు వెళ్లి ఈ-కేవైసీ ప్రక్రియ చేసుకోవాలని సూచిస్తున్నారు. ఈ కేవైసీ చేయించుకుంటేనే రూ.500లకు గ్యాస్ సిలిండర్ వస్తుందని వినియోగదారులకు చెబుతున్నారు. ఇందుకుగానూ ప్రతి గ్యాస్ వినియోగదారుల నుంచి రూ.100 నుంచి 200వరకు వసూలు చేస్తున్నారు. గ్యాస్ కనెక్షన్ ఉన్న వినియోగదారులు తప్పనిసరిగా ఈ-కేవైసీ నమోదు చేసుకోవాలని అందుకు ఎలాంటి గృహ గ్యాస్ వినియోగదారులు రుసుం చెల్లించవలసిన అవసరం లేదని సంబంధిత ఆయిల్ కంపెనీలు ఆదేశాలు జారీ చేసినా.. ఆ ఆదేశాలను తుంగలో తొక్కుతూ గ్యాస్ ఏజెన్సీలు వసూళ్లకు పాల్పడుతున్నారు.

అంతేకాకుండా కుటుంబంలో ఒకరు మరణిస్తే వారి పేరు మీద ఉన్న కనెక్షన్‌ను కుటుంబంలో మరొకరి పేరుమీదకు ట్రాన్స్‌ఫర్ చేయడానికి రూ.125 ట్రాన్స్‌ఫర్ రుసుము ఉంటుంది. కానీ ఈ గ్యాస్ ఏజెన్సీలు మాత్రం అందుకు భిన్నంగా రూ.1200 వసూలు చేస్తున్నారు. పలు గ్రామాల్లోని ప్రజలు ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. ఎవరూ పట్టించుకోవడం లేదు. తద్వారా గ్యాస్ ఏజెన్సీలు తాము ఆడిందే ఆట అన్న చందంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్యాస్ నిర్వాహకులపైన తగు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడి సస్పెండ్

- పార్టీకి వ్యతిరేకంగా పనిచేయడంతో..

నవతెలంగాణ-మద్నూర్

కామారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గజానంద్ పటేల్ పార్టీ కార్యకలాపాల్లో పార్టీకి వ్యతిరేకంగా పనిచేశారంటూ విచారణలో తేలడంతో కార్యకలాపాలకు వ్యతిరేకంగా పనిచేసిన ఆయనపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటూ సస్పెండ్ చేస్తున్నట్టు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. పార్టీకి వ్యతిరేకంగా పనిచేసే ఎంతటి వారైనా క్రమశిక్షణ చర్యలకు గురి కావాల్సిందేనని పార్టీకి కట్టుబడి క్రమశిక్షణగా పనిచేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు చర్చించుకుంటున్నారు.

ఐక్యత కమ్యూనిస్టు జాతీయ మహాసభలను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న మల్లేష్

నవతెలంగాణ-బోధన్

ఖమ్మం జిల్లాలో మార్చిలో జరిగే ఐక్యత కమ్యూనిస్టు జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని సిపిఐఎంఎల్ ప్రజాపంథా బోధన్ డివిజన్ సహాయ కార్యదర్శి మల్లేష్ అన్నారు. బుధవారం సాలూర మండలం ఖాజాపూర్ గ్రామంలో పార్టీ సభ్యుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మార్చి 3,4,5 తేదీలలో ఖమ్మం జిల్లాలో జరిగే విప్లవ కమ్యూనిస్టు పార్టీల ఐక్యత జాతీయ మహాసభలలో కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు .భారత దేశంలో బలమైన కమ్యూనిస్టు పార్టీల నిర్మాణానికి ఐక్యత సభ ఒక ముందడుగుగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశానికి సీహెచ్.గంగారాం అధ్యక్షత వహించగా అఖిల భారత రైతు సంఘం జిల్లా నాయకులు పడాల శంకర్, సంతోష్, కేశవరావు, మారుతిరావు, భీమ్రావు, సంపత్, సయ్యాజి, సి.హెచ్. గంగాధర్, రమేష్, లక్ష్మి బాయి, నరసవ్వ, సరూబాయి పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

- మోటార్ వెహికిల్ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ రామ్‌చందర్‌నాయక్
- ఆటో డ్రైవర్లకు అవగాహన

నవతెలంగాణ-మద్నూర్

వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు తప్పక పాటించాలని మోటార్ వెహికిల్ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ రామ్‌చందర్‌నాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పాత బస్టాండ్ సమీపంలో ఆటో డ్రైవర్లకు, వాహనదారులకు ఆర్టీవో, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, ప్రతి వాహనానికి సంబంధించిన ఇన్సూరెన్స్, ఆర్‌సీ బుక్ కలిగి ఉండాలన్నారు. వాహనం నడిపేటప్పుడు జాగ్రత్తగా, అతివేగంగా నడపొద్దని సూచించారు. నిబంధనల ప్రకారం ఆటోలో అధిక జనాలను కూర్చోబెట్టకూడదని డ్రైవర్‌కు ఇరువైపులా సీట్ పైన ఎవరూ కూర్చోవద్దని, ఆటోలో టేప్ రికార్డులు పెట్టుకోవద్దని సూచించారు. వాహనం నడుపుతూ సెల్‌ఫోన్‌లో మాట్లాడవద్దని ప్రత్యేకంగా అధికారుల సూచనలు పాటించాలని ఆటో డ్రైవర్లకు, వాహనదారులకు నియమాలు తెలియజేశారు. ఈ అవగాహన కార్యక్రమంలో పోలీసులు ఆటో డ్రైవర్లు ఇతర వాహనదారులు పాల్గొన్నారు.



మద్నూర్ బస్టాండ్..

మద్నూర్ బస్టాండ్‌లో సమస్యలు

- మరుగుదొడ్లు, మూత్రశాలలు కరువు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న మహిళా ప్రయాణికులకు

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మండల కేంద్రంలోని బస్టాండ్‌లో సమస్యలు తాండవిస్తున్నాయి. తెలంగాణ రాష్ట్రానికి చెందిన వారే కాకుండా.. మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాలకు చెందిన ప్రయాణికులు ఎక్కడికి వెళ్లాలన్నా. ప్రధాన కేంద్రం మద్నూరే. ఇక్కడి పాత బస్టాండ్ వద్ద నుంచే ఇటు తెలంగాణ ప్రాంతానికి అటు మహారాష్ట్ర, కర్నాటక ప్రాంతాలకు ప్రయాణిస్తారు. ఎప్పుడు చూసినా మద్నూర్ పాత బస్టాండ్ ప్రయాణికులతో రద్దీగా ఉంటుంది. పాత బస్టాండ్ ప్రయాణికులతో రద్దీగా ఉంటున్నప్పటికీ మహిళలకు, పురుషులకు మరుగుదొడ్లు, మూత్రశాలలు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా మహిళలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఎన్నో ప్రభుత్వాలు మారినా.. పంచాయతీ పాలకవర్గాలు మారినా.. బస్టాండ్‌లో సమస్యలను పరిష్కరించడం లేదు. ప్రయాణికుల కోసం మరుగుదొడ్లు, మూత్రశాలలు నిర్మించలేకపోతున్నారు. ఇప్పటికైనా కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం, పంచాయతీ పాలకవర్గం స్పందించి ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కనీస సౌకర్యాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

యువకులు క్రీడల్లో ముందుండాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ప్రతినిధులు

నవతెలంగాణ-కామారెడ్డి

యువకులు ప్రతి క్రీడల్లో ముందుండాలని ఎస్ఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. బుధవారం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల బిబిపేట్‌లో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా యస్ఆర్ ఫౌండేషన్ సభ్యులు నీల, స్వామి, పాత స్వామి, నరేష్, శ్రావణ్, రాజేష్, శ్రీశైలం పాల్గొని క్రీడాలో పాల్గొనడానికి వచ్చిన క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలియజేసి టోర్నమెంట్ ప్రారంభించారు. ఈ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్న సాయి రాహుల్‌గౌడ్, పవన్‌గౌడ్‌కు తిమ్మయ్యగారి సుభాష్‌రెడ్డి రూ.10వేలు వాలీబాల్ టోర్నమెంట్ ఖర్చులకు అందజేశారు.

పంచాయతీ కార్యదర్శుల సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదులో కార్యదర్శులు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

తెలంగాణ పంచాయతీ సెక్రటరీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం పంచాయతీ కార్యదర్శుల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జిల్లా అధ్యక్షుడు కె.మహేష్‌గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగిరెడ్డిపేట మండలంలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శుల సభ్యత్వాన్ని నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మహేష్‌గౌడ్ మాట్లాడుతూ.. పంచాయతీ కార్యదర్శుల సమస్యలను టిపిఎస్ఎఫ్ రాజీలేని పోరాటం చేస్తుందని భవిష్యత్తులో కూడా పంచాయతీ కార్యదర్శుల కొరకు ఎలాంటి పోరాటం చేయడానికైనా సిద్ధంగా ఉందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో నాగిరెడ్డిపేట్ మండల పంచాయతీ కార్యదర్శులు అధ్యక్షుడు ఎస్.సంతోష్‌తో పాటు సురేందర్, నర్సింలు, అజీముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు చేయొద్దు

- మంచి నడవడికతో ఉండండి
- కామారెడ్డి పట్టణ ఎస్‌హెచ్‌ఓ కె.చంద్రశేఖర్ రెడ్డి
- రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

నవతెలంగాణ-కామారెడ్డి

ప్రతి ఒక్కరూ మంచి నడవడికతో ఉండి.. సమాజంలో మంచి పేరు తెచ్చుకునేందుకు కృషి చేయాలని కామారెడ్డి పట్టణ ఎస్‌హెచ్‌ఓ కె.చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం కామారెడ్డి పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇకపై ఎవరూ నేరాలు చేయవద్దని, గొడవలలో పాల్గొనవద్దని సూచించారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలపాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలుంటాయని వివరించారు. ఈ కౌన్సెలింగ్‌లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు నిజాంసాగర్ నీటిని సద్వినియోగం చేసుకోవాలి

- ఇరిగేషన్ ఏఈ శృతి

నవతెలంగాణ-బోధన్

యాసంగి సీజన్‌లో భాగంగా రైతుల సౌకర్యార్థం ప్రభుత్వం నిజాంసాగర్ నీటిని విడుదల చేసిందని కావున రైతులు ఈ సాగునీటిని సద్వినియోగం చేసుకోవాలని ఇరిగేషన్ ఏఈ శృతి సూచించారు. బుధవారం ఆమె సాలూర మండలంలోని క్యాంప్ వద్ద డీ-28 కెనాల్‌ను పరిశీలించారు. కెనాల్‌లో చెత్తాచెదారం పేరుకుపోవడంతో ఇరిగేషన్ సిబ్బంది లస్కర్లతో పూడికతీత పనులు చేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 11వ తేదీన నిజాంసాగర్ ప్రాజెక్టు ద్వారా నీటిని విడుదల చేశామని, 10 రోజుల పాటు సాగునీటిని విడుదల చేస్తామని తెలిపారు. నిజాంసాగర్ కెనాల్ చివరి ఆయకట్టు వరకు రైతుల పంటకు సాగునీటిని అందిస్తామన్నారు. యాసంగి సీజన్‌లో భాగంగా మొత్తం 6 విడతలుగా సాగునీటిని విడుదల చేస్తామని, ప్రస్తుతం రెండో విడత నీటిని విడుదల చేశామని తెలిపారు. మరో నాలుగు విడతలు నీటిని రైతుల కోరినప్పుడు విడుదల చేస్తామని వివరించారు.



పనులను పరిశీలిస్తున్న ఇరిగేషన్ ఏఈ శృతి

అక్షింతలు పంపిణీ



అక్షింతల పంపిణీ శోభాయాత్రలో తండా వాసులు

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండలంలోని సముందర్ తండాలో శ్రీ రామ జన్మ భూమి తీర్థా క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం ఇంటింటికి శ్రీ రామ పూజిత అక్షింతలను అందజేశారు. అంతకు ముందు తాండ వసూలు మంగళహారతులతో శోభాయాత్ర నిర్వహించి తండాలో ఉన్న దేవాలయంలో పూజలు చేసిన అనంతరం ప్రతి గడపకూ తిరుగుతూ అక్షింతలను పంపిణీ చేశారు. అనంతరం తాండావసూలు మాట్లాడుతూ.. అయోధ్యలో శ్రీ రామ జన్మ భూమిలో ఈ నెల 22న శ్రీ బాలరాముని ప్రతిష్టాపన గత 500 సంవత్సరాల కల నెరవేరుతున్న శుభ సందర్భంగా చాలా ఆనందంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో తాండ మహిళలు, పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

రేషన్ షాపులో బియ్యం తూకం సరిగా చేపట్టాలి



వినతిపత్రాన్ని అందజేస్తున్న సంఘం నాయకులు

నవతెలంగాణ-దోమకొండ

రేషన్ షాపులో బియ్యం తూకం సరిగా చేపట్టేలా చూడాలని మండల వినియోగదారుల సంఘం అధ్యక్షులు బండారి శంకర్ కోరారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సంజయ్‌రావుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేషన్ షాపులో బియ్యం తూకంలో అక్రమాలు జరుగుతున్నాయని, వాటిని సరి చూడాలని వినియోగదారులకు, ప్రజలకు నష్టం జరగకుండా అధికారులు పర్యవేక్షించాలని కోరారు. రేషన్ డీలర్లు బియ్యం తూకంలో ఎదురు సంచివేసి తూకం వేస్తున్నారని, వినియోగదారులకు నష్టం జరిగే విధంగా ప్రవర్తిస్తున్నారని, అలా జరగకుండా చూడాలని, అక్రమాలకు పాల్పడుతున్న రేషన్ డీలర్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో శివసాయి వినియోగదారుల సంఘం అధ్యక్షులు బండారు శంకర్, ఉపాధ్యక్షులు జంగం చంద్రమౌళి, కోశాధికారి సామల లక్ష్మీనారాయణ, కార్యదర్శి బొమ్మెర బాలయ్య, కార్యవర్గ సభ్యులు అలకాటి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో దుబాయ్‌లో రాజంపేట్ వాసి మృతి



నవతెలంగాణ-రాజంపేట్

మండల కేంద్రానికి చెందిన జొన్నల రవి (34) అనే వ్యక్తి 9 సంవత్సరాల క్రితం ఉపాధి కోసం దుబాయ్ వెళ్ళాడు. ఆయన బుధవారం ఉదయం హఠాత్తుగా గుండెపోటుకు గురై మృతి చెందాడు. ఈ విషయం కుటుంబ సభ్యులకు తెలియడంతో శోక సముద్రంలో మునిగిపోయారు. భర్త మృతదేహాన్ని త్వరితగతిన స్వగ్రామానికి తీసుకురావాలని ఆయన భార్య వేడుకుంటుంది. కాగా మృతునికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

పంచాయతీల అభివృద్ధికి కృషి చేస్తా

- ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు

నవతెలంగాణ-పిట్లం

పంచాయతీల అభివృద్ధికి కృషి చేస్తానని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు అన్నారు. బుధవారం మండలంలోని కంబాపూర్ గ్రామంలో రూ.20లక్షల వ్యయంతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ప్రతి గ్రామ పంచాయతీకి నిధులు సమకూర్చి అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలనలోని ఆరు గ్యారంటీ పథకాలను అర్హులందరికీ అందేలా కృషి చేస్తానన్నారు. కాగా పంచాయతీ సభ్యులతో సమావేశమై గ్రామ అభివృద్ధి, పలు అంశాలపై చర్చించారు. గ్రామ కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరించారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్త కమ్మరి బ్రహ్మయ్య కుమారుడు ఓంకార్ 6 నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడగా వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ కవితా పాటిల్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు జంబిగే హన్మాండ్లు, రామ్‌రెడ్డి, ఎనుగండ్ల శ్రీనివాస్‌రెడ్డి, శివ, సూరత్ వంథ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు వీర్ సంగపదేశాయ్, రమేష్ దేశాయ్, హనుమండ్లు దేశాయ్ తదితరులు పాల్గొన్నారు.



పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు రుణపడి ఉంటా..

కాంగ్రెస్ పార్టీని, తనను ఎమ్మెల్యేగా గెలిపించినందుకు ప్రతి ఒక్క కార్యకర్తకు రుణపడి ఉంటానని ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు అన్నారు. బుధవారం మండలంలోని గోడమేగావ్ గ్రామంలో నిర్వహించిన విజయోత్సవ సభలో పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు స్కూల్ రిపేరింగ్, ఇతర సమస్యల గురించి వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే తన గెలుపుకు కృషి చేసిన గ్రామస్తుల సమస్యలను, రాబోయే రోజులలో 6 గ్యారెంటీ పథకాలను అమలు చేస్తానని, అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ది చేకురుస్తానని, గ్రామాన్ని అభివృద్ధి చేసి రుణం తీర్చుకుంటానన్నారు. తోట లక్ష్మీ కాంతరావు ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం మొదటిసారిగా గ్రామానికి విచ్చేయడంతో గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున శాలువాలతో ఘనంగా సన్మానించారు.

కిటకిటలాడిన టీఎస్ఆర్టీసి బస్టాండ్

నవతెలంగాణ-ఆర్మూర్



సంక్రాంతి వరుస సెలవులతో సొంత ఊర్లకు వచ్చిన విద్యార్థులు, ఉద్యోగస్తులు హైదరాబాద్, ఇతర ప్రాంతాలకు బయలుదేరేందుకు బుధవారం బారులుతీరారు. ముందస్తు రిజర్వేషన్లు సైతం చేసుకున్నారు. మహిళలు సైతం బారులు తీరారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

నవతెలంగాణ-డిచ్‌పల్లి



ఇందల్‌వాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని గౌరరం గ్రామ శివారు నుండి మంగళవారం అర్ధరాత్రి సమయంలో ఇసుక తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లు పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించి సీజ్ చేసినట్లు ఎస్సై ఎస్ మహేష్ తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లోని సమాచారంతో కాపు కాసి చుక్క తరలించిన ట్రాక్టర్లను పట్టుకున్నామన్నారు. పట్టుకున్న ట్రాక్టర్లను పోలీస్టేషన్‌కు తరలించి ఉన్నతాధికారుల ఆదేశానుసారం నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. పోలీస్ స్టేషన్ పరిధిలో అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. దీనిపై ప్రజలు పోలీసులకు ఎప్పటికప్పుడు సమాచారం అందజేయాలని ఎస్సై కోరారు.

సజ్జకు పెరిగిన డిమాండ్



- క్వింటా రూ.10వేలకు పెరిగే అవకాశం
- ముందస్తుగా ఒప్పందాలు

నవతెలంగాణ-ఆర్మూర్

డివిజన్ లోని సజ్జ పంటకు ఈసారి ఊహించని డిమాండ్ ఏర్పడనుంది. పసుపు పంటను సాగుచేసిన నేలలో రైతులు అధికంగాను సజ్జ పంట సాగు చేస్తారు.. కాగా ఈ సంవత్సరం పసుపు సాగు విస్తీర్ణం తగ్గినందున సజ్జ పంట సైతం తగ్గుతుంది. దీంతో ఈ పంటకు డిమాండ్ పెరిగిందని రైతులు చెబుతున్నారు. సజ్జకు ఇప్పటివరకు గరిష్టంగా క్వింటాలుకు 5000 మాత్రమే పలుకగా ఈసారి పదివేల వరకు పెరిగే అవకాశం ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. వచ్చేనెల వరకు ఈ పంటను విత్తవచ్చు. వాణిజ్య పంట అయిన సజ్జతో వ్యాపారులు రైతులతో ముందస్తుగానే ఒప్పందాలు చేసుకుంటున్నారు. ఉత్తర భారతంలో ఎక్కువగా సజ్జ పంటను ఆహారానికి వినియోగిస్తారు .ఆంధ్ర ప్రదేశ్, కర్ణాటక ప్రాంతాల్లో ఈసారి సకాలంలో వర్షాలు కురవనందున సజ్జ సాగు కాలేదు. దీంతో అక్కడి వ్యాపారులు, ఇక్కడ ఉన్నటువంటి వ్యాపారులతో ఒప్పందం చేసుకొని సజ్జ పంట సాగుకు విత్తనాలను సరఫరా చేస్తున్నారు. సజ్జ పంటను మన ప్రాంతంలో యాసంగి ఆఖరి పంటగా సాగు చేస్తారు..

ముందస్తు ఒప్పందాలు..

సజ్జ పంట ధర పెరగడమే కాకుండా దిగుబడి కూడా గ్యారంటీగా ముందే రాసిస్తున్నారు. ఎకరానికి 11 క్వింటాల నుండి 14 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని వ్యాపారులు ముందస్తుగానే రైతులతో ఒప్పందం చేసుకుంటు న్నారు. అంతకంటే తక్కువ దిగుబడి వస్తే ఎకరానికి 11 క్వింటాలు ధర చెల్లించేందుకు ఒప్పందం చేసుకుంటున్నారు. పంట విక్రయించిన పది రోజుల్లోనే డబ్బుల చెల్లింపు ఉంటుందని అగ్రిమెంటు చేసుకుంటున్నారు. బజీరా వెరైటీకి ఎక్కువ ధర వచ్చే అవకాశాలు ఉన్నట్లు రైతులు తెలిపారు.

తాళం వేసిన ఇళ్లల్లో చోరీలు

- రెండు కాలనీల్లో ఘటనలు
- నగదు, బంగారం అపహరణ

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ తిరుమల కాలనీలో తాళం వేసిన రెండిళ్లలో, మామిడిపల్లి వెంకటేశ్వర కాలనీలో తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని దొంగలు చోరీకి పాల్పడ్డారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. పెర్కిట్ తిరుమల కాలనీలో ప్రవీణ్ అనే వ్యక్తితో పాటు బంగ్లాపైన అద్దెకు ఉంటున్న శ్రీకాంత్ ఇళ్లల్లో దొంగలు చోరీకి పాల్పడి నగదు బంగారంను ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. ప్రవీణ్ ఇంట్లో సుమారుగా 9 వేల నగదు, 14 తులాల బంగారం, శ్రీకాంత్ ఇంట్లో నుండి ఐదు తులాల వెండిని ఎత్తుకెళ్లారని అన్నారు. ఘటనా స్థలానికి పోలీసులు క్లూస్ టీమ్ బృందం చేరుకొని వివరాలు సేకరించి కేసు నమోదు చేసుకున్నారు. కాగా ఈ కాలనీలో పోలీసులు రాత్రి సమయంలో పెట్రోలింగ్ పెంచాలని కోరారు.

వెంకటేశ్వర కాలనీలో..

మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి వెంకటేశ్వర కాలనీలో నివసించే జోష్ణ తన ఇంటికి తాళం వేసి రాజారామ్ నగర్ లోని తన అత్తగారి ఇంటికి ఫంక్షన్కు వెళ్ళింది.. ఇంటికి తాళం వేసి ఉండడం గమనించిన దొంగలు అర్ధరాత్రి గోడదూకి ప్రధాన డోరు తలుపులు, తాళాలు పగలగొట్టి రెండున్నర లక్షల నగదు, రెండు తులాల బంగారం, ఎలక్ట్రానిక్ వస్తువులు సైతం ఎత్తుకెళ్లినట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాగా క్లూస్ టీం సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని ఆధారాలు సేకరించినట్టు, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు స్టేషన్ హౌస్ ఆఫీసర్ సురేష్ బాబు తెలిపారు.

కంజర్ గురుకులంలో ఐదవ తరగతిలో ప్రవేశాలకు ఆన్లైన్ దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-మోపాల్

మోపాల్ మండలం కంజర్ గురుకుల విద్యాలయాల్లో ఎస్సీ ఎస్టీ బీసీ మరియు సాధారణ 2024-25 విద్యా సంవత్సరానికి 5వ తరగతి ప్రవేశాల కోసం ప్రవేశ పరీక్షకోసం విద్యార్థుల నుంచి ఆన్లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల ప్రిన్సిపల్ జి.మాధవి లత బుధవారం తెలిపారు. 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల తల్లిదండ్రుల ఆదాయం లక్ష యాభై వేల లోపు పట్టణ విద్యార్థుల తల్లిదండ్రుల ఆదాయం రెండు లక్షల లోపు ఉండాలని తెలిపారు. ఫిబ్రవరి 11న ఉమ్మడి ప్రవేశ పరీక్ష ఉంటుందని, విద్యార్థులు 100 రూపాయల రుసుం చెల్లించి ఆన్లైన్లో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. విద్యార్థులు 2023-24 విద్యా సంవత్సరం ప్రభుత్వం లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 4వ తరగతి చదువుతూ ఉండాలని తెలిపారు. ఆసక్తి అర్హత గల విద్యార్థుల తల్లిదండ్రులు %ఘఘఒంషటీవఆర్.వశ్రీఖఅస్త్రుఆఖ. శ్రశీజ.ఱఅ% వెబ్‌సైట్ ద్వారా పరీక్షకోసం ఈనెల 20 లోపు పేర్లను నమోదు చేసుకోవచ్చని తెలిపారు. గురుకుల పాఠశాలలో నాణ్యమైన ఉచిత విద్యతోపాటు వసతి సౌకర్యం, పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఇస్తారని, విద్యార్థుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ తెలిపారు.

ఆర్థిక సహాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న మిత్రులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్ వాయి మండలంలోని గన్నారం గ్రామానికి చెందిన గల్ఫ్ బాధితుడు 15 రోజుల క్రితం వాళ్ళ అమ్మ ఆరోగ్యం బాగాలేనందున ఆసుపత్రి కి వెళ్తున్న సమయంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి చెట్టుకు ఢీకొంది. ఈప్రమాదంలో తీవ్ర గాయాలై జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందిన గోవర్ధన్‌కు గల్ఫ్ మిత్రులు, గన్నారం గ్రామంలో ఉన్న మిత్రులు తమ వంతుగా 67వేల750 రూపాయల ఆర్థిక సహాయాన్ని బుధవారం బాధితుడికి అందజేశారు. పందిన గోవర్ధన్‌కు భార్య కూతురు ఉన్నారు. ఆయన ఆర్థిక పరిస్థితి బాగా లేనందున గల్ఫ్ మిత్రులు తమకు తోచిన సహాయం చేశారు. గన్నారం గ్రామానికి చెందిన ముదిరాజ్ కులస్తులు కలిసి సహాయం అందజేశారు. గల్ఫ్‌లోని దుబాయి, కువైట్, సౌదీ అరేబియా తో పాటు పలు దేశాలకు చెందిన మిత్రులు ఆర్థిక సహాయం చేయడం పట్ల బాధిత కుటుంబ సభ్యులు వారందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలిపారు. గోవర్ధన్ త్వరగా కోలుకోవాలని వారు కోరారు.

ఆటల్లోనూ ముందుండాలి

ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి



క్రీడల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

విద్యార్థిని విద్యార్థులు చదువుతోపటు ఆటలలో ముందుండాలని విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి అన్నారు .పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల లో బుధవారం తెలంగాణ స్టేట్ లెవెల్ అండర్ 14(బాలురు, బాలికల) సాఫ్ట్ బాల్ టోర్నమెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ దుర్గారెడ్డి, పెంట జలంధర్, వ్యాయామ ఉపాధ్యాయులు మల్లేష్ గౌడ్ ,గంగా మోహన్, రాజేశ్వర్, కౌన్సిలర్ రవి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన వ్యవసాయశాఖ అధికారులు



మంత్రిని సన్మానిస్తున్న అధికారులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జిల్లా పర్యటన కు వచ్చిన సందర్భంగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజిద్ హుస్సేన్, నిజామాబాద్ డివిజన్ ఏడీఏ ప్రదీప్ కుమార్, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన వ్యవసాయ శాఖ అధికారులు కలిసి జిల్లాలో, డివిజన్లో వ్యవసాయానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు మంత్రికి శాలువా, పుష్ప గుచ్చం అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు రాంబాబు, ప్రవీణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బైపాస్ రోడ్డు వద్దు..పాత రోడ్డు కావాలి

నవతెలంగాణ-బేల

మండల కేంద్రంలోని అంతర్ రాష్ట్ర రోడ్డుపైన బుధవారం రైతులు రోడ్డెక్కారు. అంతర్ రాష్ట్ర రహదారి 353 బేల మండల కేంద్రం నుంచి బైపాస్ దాదాపుగా 4.50 కిలోమీటర్లు వెళ్తుంది. ఈ బైపాస్ గుండా భూములు కోల్పోతున్న, శంషాబాద్, డోప్టాల, మొహబత్‌పూర్ రైతులు రోడ్డుపైన రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ నాలుగు వరుసల రహదారికి తాము అడ్డుకోమని, కానీ ఎక్కడి నుంచి ఈ రహదారి ప్రారంభమైందో ఆ ప్రాంతాల్లో ఎక్కడ కుడా బైపాస్ ఊసే లేదు. కేవలం బేల మండలానికి వచ్చే సరికి బైపాస్ రోడ్డును చేపడుతున్నారని పేర్కొన్నారు. ఇక్కడ ఉండే రైతులు చిన్న, సన్న కారు రైతులమని, మా జీవనాధారం వ్యవసాయమని అన్నారు. ఈ సందర్భంగా బాధిత రైతులు బైపాస్ రోడ్డు వేస్తే తమ బంగారు భూములు కోల్పోయి ఆర్థికంగా చాలా నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్కువ మంది సన్న, చిన్న కారు రైతులు వ్యవసాయ భూమి పైన ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నామని అన్నారు. ఏది ఏమైనా బైపాస్ రోడ్డుకు తమ భూములను ఇవ్వబోమని రైతులు తెలియజేశారు.అవసరమైతే నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు ఒళ్లఫ్‌వార్ దేవన్న, విపిన్ ఖోడే, విశ్వనాథ్, రామారావు, నందు అమిడ్‌వార్, అనిల్, ఖోడే సచిన్ పాల్గొన్నారు.

కేసులు పెట్టి జైలుకు పంపడం సరికాదు

నవతెలంగాణ-నిర్మల్

ఇండ్ల స్థలాలకై పోరాటాలు నిర్వహిస్తున్న సీపీఐ(ఎం) నాయకులపై నాన్ బెయిలబుల్ కేసులు పెట్టి జైలుకు పంపడం సరికాదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం నూతన్ కుమార్, జిల్లా అధ్యక్షులు డాకూర్ తిరుపతి అన్నారు. బుధవారం ప్రజాసంఘాల కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్రంలో లక్షకు పైగా గుడిసెలు వేసి ఇండ్ల స్థలాలు లేని పేదల కోసం గూడు కల్పించడం కోసం సీపీఐ(ఎం), ప్రజా సంఘాలు నిర్వహిస్తున్నటువంటి పోరాటాలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతూ నాన్ బెయిలేబుల్ కేసులు పెట్టి జైలుకు పంపడాన్ని జిల్లా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం కమిటీ వ్యతిరేకిస్తుందని అన్నారు. ప్రభుత్వం ఇండ్లు లేని నిరుపేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలం లేని నిరుపేదలకు ఇంటి స్థలాన్ని ఇస్తామని చెప్పినటువంటి కాంగ్రెస్ జగిత్యాల, కోరుట్ల కేంద్రంగా రెండు మూడు నెలలుగా జరుగుతున్నటువంటి భూపోరాటాలను అనచివేసేందుకు సీపీఐ(ఎం) నాయకుల పైన, ప్రజాసంఘాల నాయకులు పైన నాన్ బెయిలేబుల్ కేసులు పెట్టిందని అన్నారు. వెంటనే వారిపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని పేదలకు ఇండ్ల స్థలాలు, పట్టాలు ఇచ్చి ఇంటి నిర్మాణానికి రూ.5లక్షల ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నిర్మల్ మండల కార్యదర్శి చందుల సాయికిరణ్ పాల్గొన్నారు.

మైనర్‌లను పనిలో పెట్టుకోవడం నిషేదం

జిల్లా బాలల సంరక్షణ అధికారి దేవి మురళి

నవతెలంగాణ-ఖానాపూర్

14 సంవత్సరాలు వయసు పూర్తికాని చిన్న పిల్లలను పనిలో పెట్టుకోవడం నిషేధమని బాలల సంరక్షణ జిల్లా అధికారి దేవి మురళి అన్నారు. బుధవారం ఆపరేషన్ స్మైల్-10 కార్యక్రమంలో భాగంగా ఖానాపూర్ మండలంలోని తిమ్మాపూర్, సాయినగర్ కాలనీ, మస్కపూర్, ఇక్బాల్‌పూర్ గ్రామంలోని సిమెంట్ బ్రిక్స్, ఇటుకబట్టిలు తదితర ప్రదేశాలను స్మైల్ బృందం ఆకస్మిక తనిఖీ చేశారు. పిల్లలు పనిచేస్తున్నారని ఆరాతీశారు. ఈ సందర్భంగా జిల్లా బాలల సంరక్షణ అధికారి దేవి మురళి మాట్లాడుతూ యజమానులకు బాలకార్మిక చట్టాల గురించి వివరించారు. పిల్లలను పనిలో పెట్టుకుంటే జరిగే పరిమాణాల గురించి తదితర అంశాలపై అవగాహన కల్పించామన్నారు. 14 సంవత్సరాలు పూర్తికానీ పిల్లలని ఎక్కడ కూడా పనిలో పెట్టుకోకూడదన్నారు. 15 నుంచి 18 సంవత్సరాలు పూర్తికాని పిల్లలను ప్రమాదకరమైన పనిలో ఎక్కడ కూడా పెట్టుకోకూడదని అన్నారు. బాల కార్మికులు ఎక్కడ కనిపించిన ఈ 1098 నెంబర్‌కి సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ డివిజన్ స్మైల్ టీం ఇన్‌చార్జి ఎస్సై అశోక్, టీమ్ చిన్నయ్య, షౌకత్, నరేష్, వజ్రమ్మ చైల్డ్ హెల్ప్ లైన్ 1098 జిల్లా కోఆర్డినేటర్ నల్ల గంగాధర్, చైల్డ్ హెల్ప్ లైన్ కౌన్సిలర్ సుప్రియ, నవీన్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్

నవతెలంగాణ-ముధోల్

క్రీడలతో మానసికోల్లాసంతో పాటు శారీరదారుఢ్యం పెంపొందుతుందని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ మైదానంలో ముధోల్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. యువకులు క్రీడలతో పాటు చదువుల్లో రాణించాలన్నారు. ప్రతి క్రీడాకారుడు క్రీడ స్ఫూర్తిని కలిగి ఉండాలని సూచించారు. ఫైనల్ మ్యాచ్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మదీనా జట్టుకు మొదటి బహుమతి రూ.11వేల111 నగదు, షీల్డ్, రన్నరప్ జట్టుకు రూ.6వేల 666 నగదు, షీల్డ్ బహుమతులు ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు దేవోజి భూమేష్, పీఏసీఎస్ డైరెక్టర్ ధర్మపురి సుదర్శన్, బీజేపీ మండల అధ్యక్షులు కోరి పోతన్న, మండల ఇన్‌చార్జ్ తాటివార్ రమేష్, నాయకులు మదన్, ధర్మపురి శ్రీనివాస్, దశరత్, భూషణ్, గంగాధర్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న రైల్వే సాధన కమిటీ రిలేదీక్షలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ నుంచి ఆర్మూర్ వరకు రైల్వే లైన్ ఏర్పాటు చేయాలని చేపట్టిన రిలేదీక్షలు కొనసాగుతున్నాయి. అందులో భాగంగా బుధవారం ఆదిలాబాద్‌కు చెందిన ప్రభుత్వ, ప్రయివేటు ఉద్యోగ, వర్తక, వాణిజ్య, ప్రజాసంఘాల ప్రతినిధులు. తమ చిరకాల వాంఛ నెరవేర్చుకునే క్రమంలో రిలే నిరాహారదీక్షలతో పోరాటాన్ని ఉధృతం చేస్తున్నారు. అందులో భాగంగా దీక్షా శిబిరాన్ని కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సమస్యను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని అన్నారు. తక్కువ ఖర్చుతో పూర్తయ్యే ఈ రైల్వేలైను నిర్మాణాన్ని కేంద్రం దశాబ్దాలుగా నాన్చుతోందని అన్నారు. ఇది పూర్తి అయితే ఈ ప్రాంతానికి విద్య, వైద్యం, పారిశ్రామిక రంగాలకు ఎంతో మేలుకలుగుతుందని పేర్కొన్నారు. వెంటనే ఈ విషయమై కేంద్రం దృష్టి సారించి, జిల్లావాసుల చిరకాల ఆకాంక్షను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆయన వెంట డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, జైనథ్ జెడ్పీటీసీ తుమ్మల అరుంధతి వెంకట్‌రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి, బేల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఫైజుల్లా ఖాన్, సాత్నాల ప్రాజెక్ట్ మాజీ చైర్మెన్ అల్లూరి అశోక్‌రెడ్డి, నాయకులు మానే శంకర్, రూపేష్‌రెడ్డి, దీపక్‌రావు, మహమూద్, హరీష్‌రెడ్డి ఉన్నారు.

సైకిల్ యాత్ర

నవతెలంగాణ-ముప్కాల్

అయోధ్యలో ఈ నెల 22న శ్రీరాముని విగ్రహ 'ప్రాణప్రతిష్ట' దేశ ప్రధాని నరేంద్ర మోడీ చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. దీని గురించి తెలుపుతూ మండలంలో సైకిల్ యాత్ర చేపడుతున్నాడు రామ భక్తుడు ముప్కాల్ మండల కేంద్రానికి చెందిన లోక రాములు. ఆయన యాత్రపై మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పెర్కిట్ విడిసి కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ గ్రామ అభివృద్ధి కమిటీ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు.. అధ్యక్షులుగా సాహెబ్ గారి దేవేందర్, కార్యదర్శిగా మాడవేడి అశోక్, కోశాధికారిగా నచ్చు రాజబాబు, ఉపాధ్యక్షులుగా గంగాధర్‌ను ఎన్నుకున్నారు ..ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ అభివృద్ధిలో భాగస్వాములై పనులు చేస్తామని తెలిపారు.

పల్లె అభివృద్ధికి కృషి

నవతెలంగాణ-బోథ్

పల్లెల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్నానని ఎంపీపీ తుల శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని పాట్నాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించే మురుగు కాలువ నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండల ప్రజా పరిషత్ నిధుల నుంచి రూ.4లక్షల నిధులతో మురుగు కాలువ నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. మారుమూల గ్రామాల అభివృద్ధికి తనవంతుగా నిధులు కేటాయిస్తూ, సమస్యల పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. గ్రామంలో ఇప్పటికే చాలా అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. అలాగే మరిన్ని గ్రామాలతో పోలిస్తే అభివృద్ధిలో ఆదర్శంగా పాట్నాపూర్ గ్రామం నిలువడం జరిగిందని తెలిపారు. మునుముందు మరెన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు కృషి చేస్తామన్నారు. అలాగే గ్రామంలో ఇచ్చిన మాట ప్రకారం పూలాజీ బాబా మందిర్ నిర్మాణానికి రూ.1లక్ష భక్తులకు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పంద్రం సుగుణ, ఎంపీడీఓ సుశీల్ కుమార్‌రెడ్డి, ఎంపీటీసీ జుగాదిరావ్, పీఏసీఎస్ చైర్మెన్ ప్రశాంత్, ఆయా గ్రామల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మెరుగైన సమాజం కోసం అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని తహసీల్దార్ శ్రీలత అన్నారు. బుధవారం మండల కేంద్రంలో 2కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ ప్రధాన ఎన్నికల కమిషనర్‌ల ఆదేశానుసారం సిస్టమేటిక్ ఓటర్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని వివరించారు. నూతన ఓటర్లు, యువఓటర్లు విధిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని అన్నారు. ఆయా గ్రామాల్లోని బీఎల్‌ఓలు నూతన ఓటరులకు చైతన్యం కల్పించి ఓటరు నమోదు పక్రియ దిగ్విజయం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శేఖర్, డిప్యూటి తహసీల్దార్ వి.గంగాధర్, వరల్డ్ విజన్ సంస్థ మేనేజర్ బ్రహ్మయ్య, రెవిన్యూ సిబ్బంది, బీఎల్‌ఓలు, యువకులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సహకరించాలి

నవతెలంగాణ-నార్నూర్

గ్రామపంచాయతీ అభివృద్ధికి సహకరించాలని ఎంపీ సోయం బాపురావును నార్నూర్ సర్పంచ్ బానోత్ గజానంద్ నాయక్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు యుర్వేత రూపదేవ్ కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎంపీ స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి ఎంపీ నిధులు మంజూరు చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు గ్రామపంచాయతీల్లో అమలు పరిచేలా కృషి చేయాలని కోరారు. ఎంపీ సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. వారి వెంట వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు సుజాత పరమేశ్వర్, కళావతి ఉత్తం ఉన్నారు.

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

నవతెలంగాణ-ఉట్నూర్

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. బుధవారం ఉట్నూర్‌లోని కేబి కాంప్లెక్స్ క్రీడా మైదానంలో ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహించిన 7వ ఇంటర్ సొసైటీ స్పోర్ట్స్ లీగ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు సోయం బాపురావు, గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ వెంకట్ నరసింహారెడ్డి, సోషల్ వెల్ఫేర్ కార్యదర్శి నవీన్ నికోలస్, జిల్లా ఎస్పీ గౌస్ ఆలమ్, పీఓ చాహత్ బాజ్‌పాయ్, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌లతో కలిసి పాల్గొన్నారు. ముందుగా క్రీడా జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించి, జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం అతిథులు విద్యార్థుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఖానాపూర్ ఎమ్మెల్యే మాట్లాడుతూ రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థులు క్రీడా రంగాలలో రాణిస్తూ, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ క్రీడా రంగాలలో రాణించి, పతకాలు సాధించాలని అన్నారు. క్రీడల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు వసతి సౌకర్యాలు కల్పిస్తున్నామని అన్నారు. ఆటలతో పాటు చదువులోను రాణించి పాఠశాలలకు, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలన్నారు. ఎంపీ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడలను ప్రోత్సహించడంతో క్రీడాకారులు ఒలంపిక్స్, ఆసియన్ వంటి గేమ్స్‌ల్లో 200 పైగా పతకాలు సాధించడం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించేందుకు రాష్ట్రాలలో ఖేలో ఇండియా వంటి పోటీలను నిర్వహిస్తుందని తెలిపారు. విద్యార్థులు క్రీడలలో రాణించేందుకు అవసరమైన వసతులు కల్పించేందుకు తనవంతు కృషి చేస్తానని అన్నారు. గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ మాట్లాడుతూ 7వ ఇంటర్ సొసైటీ స్పోర్ట్స్ లీగ్‌లో పాల్గొంటున్న విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 1022 గురుకుల విద్యాసంస్థలలో విద్యనభ్యసిస్తున్న 5 వేల మంది వివిధ క్రీడా పోటీలలో పాల్గొంటున్నారని తెలిపారు. విద్యార్థులకు విద్యతో పాటు వికాసం, ఆరోగ్యం కోసం ఇలాంటి స్పోర్ట్స్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. నాణ్యమైన విద్యతో పాటు భోజన వసతులు కలిపిస్తున్నామని అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. సోషల్ వెల్ఫేర్ కార్యదర్శి మాట్లాడుతూ రెసిడెన్షియల్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఐఐటి, ఎన్ఐటి, నీట్‌లలో ర్యాంక్‌లు సాధిస్తున్నారని, అలాగే క్రీడల్లో జాతీయ స్థాయిలో రాణిస్తూ దేశానికి, రాష్ట్రానికి గుర్తింపు తీసుకువస్తున్నారని అన్నారు. విద్యార్థులు క్రీడలలో రాణించేందుకు మెనూ ప్రకారం భోజనం అందిస్తూ, ప్రత్యేక కోచ్‌లను నియమించడం జరిగిందని తెలిపారు.

జిల్లా ఎస్పీ మాట్లాడుతూ స్పోర్ట్స్ లీగ్ కార్యక్రమంలో పాల్గొంటున్న క్రీడాకారులందరికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ గేమ్స్ తన చిన్ననాటి రోజులను గుర్తు చేస్తుందని, కార్యక్రమంలో పాల్గొన్నందుకు సంతోషంగా ఉందన్నారు. ప్రతి విద్యార్థిలో ఏదో ఒక ప్రతిభ దాగి ఉంటుందని, ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతో ప్రోత్సాహాన్ని అందిస్తాయన్నారు. పీఓ మాట్లాడుతూ, 7వ ఇంటర్ సొసైటీ స్పోర్ట్స్ లీగ్ లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, రన్, ఆర్చరీ వంటి క్రీడలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. 4 రోజులపాటు నిర్వహించే క్రీడాపోటీలలో పాల్గొంటున్న విద్యార్థులు, కోచ్, సిబ్బందికి అవసరమైన వసతులు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. విద్యార్థుల వికాసం కోసం సాంస్కృతిక కార్యక్రమాలు, మ్యాజిక్ షో వంటి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రీడాపోటీలు పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తామన్నారు. క్రీడలలో గెలుపు ఓటములు సహజమని, దేనినైనా సమానంగా తీసుకొని జీవితంలో విజయాలు సాధించాలని కోరారు. ఈ క్రీడా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులందరూ విజేతలేనని పీఓ పేర్కొన్నారు. బోథ్ ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడా రంగాలలో రాణించే విద్యార్థులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ లభిస్తుందని అన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం క్రీడా పోటీలను జెండా ఊపి ప్రారంభించి, 800 మీటర్ల రన్‌లో గెలుపొందిన క్రీడాకారులకు ప్రశంసా పత్రాలు, మెడల్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహ్వానితులను ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళ కమిషన్ సభ్యురాలు ఈశ్వరిబాయి, శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మోహతో, అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బొల్లారంలో గ్రామసభ



నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండలంలోని బొల్లారం గ్రామంలో బుధవారం సర్పంచ్ వీణ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మీనా మాట్లాడుతూ.. బొల్లారం గ్రామ బాల కార్మికుల నిర్మూలన గ్రామంగా ఏర్పాటు చేయబడిందని ఆమె అన్నారు. ఈ సందర్భంగా సాధన సంస్థ ప్రతినిధి శ్రీనివాస్ మాట్లాడుతూ.. జిల్లాలో బాల కార్మికుల నిర్మూలన కొరకు బాల్యవివాహాల నిర్మూలన కొరకు, మనుషుల అక్రమ రవాణా నివారణ కోసం అవగాహన కల్పించినట్టు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ధర్మవీర్, పంచాయతీ కార్యదర్శి సంతోష్, గ్రామపెద్దలు ధనుంజయ పాల్గొన్నారు.

సర్వమతాలను సమానంగా గౌరవించాలి



నవతెలంగాణ-జుక్కల్

సర్వమతాలను సమానంగా గౌరవించాలని జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావ్ అన్నారు. బుధవారం మండలంలోని నాగల్‌గావ్ గ్రామంలో చర్చి భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నూతనంగా గెలిచిన తరువాత గ్రామానికి రావడంతో గ్రామ కాంగ్రెస్ నాయకుడు, మాజీ సర్పంచ్ అనిల్‌కుమార్, చర్చి సభ్యులు శాలువాతో ఎమ్మెల్యేను సన్మానించారు. అనంతరం అన్ని పండుగలు, మతాల వారు కలిసిమెలిసి ఉంటూ గర్వంగా ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పెద్దఎడ్గి సర్పంచ్ ఎ.వినోద్, కేమ్రాజ్‌కల్లాలీ సర్పంచ్ రమేష్ దేశాయి, మహమ్మదాబాద్ సర్పంచ్ లక్షెట్టి సాయిలు, విండో డైరెక్టర్ విఠల్ పటేల్, మాజీ ఎంపిపి లక్ష్మణ్ పటేల్, వీరేశం, బాబు పటేల్ తదితరులు పాల్గొన్నారు.

చివరి ఆయకట్టుకూ సాగు నీరందిస్తాం

- మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి

నవతెలంగాణ-వర్ని

నిజాంసాగర్ ఆయకట్టు రైతులకు చివరి ఆయకట్టువరకూ సాగునీరందిస్తామని మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి అన్నారు. బుధవారం బాన్సువాడ, బీర్కూర్, వర్ని మండలాల్లో నిజాంసాగర్ ప్రధాన కెనాల్ నుంచి డిస్ట్రిబ్యూషన్ కెనాల్‌ను పరిశీలించారు. కాలువల పరిస్థితి మెరుగుపర్చాలని, తదితర గ్రామాల మధ్యలో ఉన్న 25, 26 డిస్ట్రిబ్యూటరీ కాలువలను, బీర్కూర్ మండల కేంద్రం రైతుల చిరకాల కోరికైన 26/4 డిస్ట్రిబ్యూటరీ కాలువ నిర్మించే స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 26/4 కాలువ నిర్మాణ పనులకు సంబంధించిన అనుమతుల కోసం ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి కాలువ మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ఈ కాలువ నిర్మాణం చేపడితే నాలుగు వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని అన్నారు. కాలువ నిర్మాణం కోసం 2009లోనే అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం శంకుస్థాపన చేసిన ఆ తర్వాత వచ్చిన పాలకులు కాలువ నిర్మాణంపై దృష్టి పెట్టకపోవడంతో కేవలం శంకుస్థాపనతోనే పనులు ఆగిపోయాయని ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని అనేక చర్యలు తీసుకుంటుందని అన్నారు. త్వరలోనే కాలువ నిర్మాణానికి సంబంధించి అనుమతులు మంజూరయ్యేలా చర్యలు చేపడతామని వర్ని కెనాల్‌ను కూడా నిర్మాణం చేపట్టి ఘన్‌పూర్ ఆయకట్టు రైతులకు కూడా సాగు నీరందేలా చూస్తామన్నారు. ఆయనతో పలు మండలాల రైతులున్నారు.



కెనాల్‌ను పరిశీలిస్తున్న ఏనుగు రవీందర్‌రెడ్డి

నేడు నీటి సరఫరా బంద్

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలో 18వ తేదీ గురువారం నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ తూము పద్మశరత్‌రెడ్డి, కమిషనర్ ఖమర్ అహ్మద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో గల ప్రధాన పైప్‌లైన్ లీకేజీ కారణంగా, పైపులైను మరమ్మతులు చేపడుతున్నామని, అందుకని ప్రజలకు తాగునీటి సరఫరా చేయడంలో అంతరాయం కలుగుతుందని, పట్టణ ప్రజలు సహకరించాలని వారు కోరారు.

సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని కన్నాపూర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే కల్వకుంట్ల మదన్ మోహన్‌రావు చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు బుధవారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ రవీందర్ రావు, ఉప సర్పంచ్ అంజిల్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సీఎం రేవంత్ రెడ్డి ఎల్లారెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి రూ.10 కోట్లు నిధులు కేటాయించినందుకు పాలాభిషేకం చేశామని, భవిష్యత్తులో మదన్ మోహన్‌రావు ఆధ్వర్యంలో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ వెంకటస్వామి, రైతు కన్వీనర్ మహేష్ యాదవ్, ప్రశాంత్, హరీష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బోధన్ ఉమ్మడి మండలంలో ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి పర్యటన

నవతెలంగాణ-బోధన్

బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరు సుదర్శన్‌రెడ్డి గురువారం బోధన్ ఉమ్మడి మండలంలోని పలు గ్రామాలలో పర్యటిస్తారని ఆయన వ్యక్తిగత సహాయకులు రమణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి ఆయన సాలుర మండలం హున్సా, సాలూర, సాలూర క్యాంప్, జాడి జమాల్పూర్, బోధన్ మండలం కల్దుర్కి, మావందిఖుర్దు, పెగడపల్లి గ్రామాలలో పర్యటించి పార్టీ వర్గాలతో, రైతులతో మాట్లాడతారని కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం తొలిసారిగా ఆయా గ్రామాల పర్యటనకు వస్తుండడంతో నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికేందుకు ఘనంగా ఏర్పాటు చేస్తున్నారు.

మున్నూరు కాపు క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-రామారెడ్డి

మండల కేంద్రంలో మున్నూరుకాపు సంఘం నూతన క్యాలెండర్‌ను తంకర్ రవికుమార్, శ్రీ కల్కి ప్రింటర్ శ్రీధర్ చేతుల మీదుగా బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం మండల అధ్యక్షులు కడెం శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి కాల హనుమాన్లు, కోశాధికారి దప్పురి స్వామి, ప్రచార కార్యదర్శి బండి లింగం, గౌరవ అధ్యక్షులు పైడాకుల కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ సంకల్పయాత్ర



నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-మద్నూర్

కేంద్రంలో గల ఎన్డీఏ బీజేపీ నరేంద్ర మోదీ ప్రభుత్వ హయాంలో గడిచిన 9 సంవత్సరాల పాలనలో ఎన్‌డిఏ ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాలపై బుధవారం మండల కేంద్రంలోని గాంధీచౌక్ ఆవరణలో ప్రభుత్వ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు, బ్యాంక్ మేనేజర్లు కేంద్ర ప్రభుత్వం ద్వారా ప్రజలకు అమలయ్యే సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ సంకల్ప యాత్ర కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, బ్యాంకు మేనేజర్లు, గ్రామపంచాయతీ కార్యదర్శి సందీప్, మద్నూర్ గ్రామస్తులు పాల్గొన్నారు. అలాగే ఈ కార్యక్రమంలో 2024 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో

బీఆర్ఎస్ పార్టీ సత్తాచాటాలి

- ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్

నవతెలంగాణ-ఎల్లారెడ్డి(లింగంపేట్)

త్వరలో జరగనున్న పార్లమెంటు జహీరాబాద్ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ సత్తా చాటాలని ఎల్లారెడ్డి మాజీ శాసనసభ్యులు జాజాల సురేందర్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బుధవారం ఎల్లారెడ్డి పట్టణంలో నియోజకవర్గ, మండల ప్రజాప్రతినిధుల, పార్టీ అధ్యక్షులతో జరిగిన సమావేశంలో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా అధిష్టానం సీటు కేటాయించిన ఎంపి అభ్యర్థి గెలుపు కోసం కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని ముందస్తుగా సమావేశంలో సూచించారు. త్వరలోనే మండలాల వారీగా పార్టీ ముఖ్యనేతలు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఇప్పటి నుంచే ప్రతీ గ్రామాలలో నాయకులు ప్రజలతో మమేకం కావాలని, ఇందుకోసం ప్రణాళిక రూపొందించుకుని పార్టీ గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో స్థానిక మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, బిఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షులు జలందర్‌రెడ్డి, దివిటి రమేష్, సిద్దయ్య, జడ్పీటిసిలు ఉషాగౌడ్, మనోహర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ ఎగుల నర్సింలు, ముదాం సాయిలు, శ్రీనివాస్ నాయక్, దుర్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సురేందర్

కామ్రేడ్ జ్యోతిబసు వర్ధంతి

నవతెలంగాణ-బోధన్

కామ్రేడ్ జ్యోతి బసు 14వ వర్ధంతిని బుధవారం మండలంలోని ఊట్పల్లి గ్రామంలో సిపిఐ(ఎం) ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం బోధన్ ఏరియా కమిటీ కార్యదర్శి ఏశాల గంగాధర్ మాట్లాడుతూ..సిపిఐ(ఎం)ను భారత దేశంలో ఏర్పాటు చేసిన మొట్టమొదటి నాయకులలో జ్యోతి బసు ఒకరని అన్నారు. అలాగే సిపిఐ(ఎం)ను 34 సంవత్సరాల పాటు బలమైన పార్టీగా నిలిపి రాజకీయాలలో ప్రధాన పాత్ర పోషించారని అన్నారు. 24 సంవత్సరాలు ఏకధాటిగా ముఖ్యమంత్రిగా పనిచేసే రికార్డులు సృష్టించారని తెలిపారు. తన పరిపాలనలో రాష్ట్రంలో 13 లక్షల ఎకరాల భూమిని పేద ప్రజలకు పంపిణీ చేశారని అన్నారు. దేశంలో వామపక్ష పార్టీలు ఐక్యంగా ఉండటానికి, ఎన్నికలలో ప్రజా సమస్యలు పరిష్కారం కొరకు పనిచేశారని వివరించారు. ప్రధానమంత్రి పదవిని త్యాగం చేసిన గొప్ప మనసు ఆయనదని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఐ(ఎం) నాయకులు కార్యకర్తలు దండు సాయిలు, దండు సాయికుమార్, దండు పెద్ద సాయిలు, దండు రాణి, దండునాగమణి, రమేష్, రాజు, నాగరాజు, సావిత్రి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



జ్యోతిబసు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కుసుమ పంటలో పేనుబంక

- ఉధృతిని తగ్గించుకోవాలి
- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి భాగ్యలక్ష్మి

నవతెలంగాణ-తాడ్వాయి

కుసుమ పంటలో పేను బంక ఉధృతి ఎక్కువగా ఉందని, ఈ ఉధృతిని తగ్గించుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి భాగ్యలక్ష్మి తెలిపారు. మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో ఆమె బుధవారం కుసుమ, వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కుసుమ పంటలో ఎక్కువగా పేనుబంక ఉధృతి ఉందని తెలిపారు. దీని నివారణకు అసెట్ మాప్రేడ్ 0.2 గ్రాములు, లేదా ఇమిడాక్లోప్రైడ్ 0.3 మిల్లీలీటర్లు పిచికారీ చేసుకోవాలని సూచించారు. అలాగే వరి పంటలో ఉల్లికొడు ఆశించే అవకాశం ఉన్నందున రైతులు వెంటనే విప్రోనిల్ మందును పిచికారీ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి శ్రీకాంత్, వ్యవసాయ విస్తరణ అధికారి రాజశేఖర్‌రెడ్డి, రైతులు వెంకట్రావు, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారిణి

నాణ్యమైన పాల ఉత్పత్తికి ప్రాధాన్యతనివ్వాలి

- రాష్ట్ర విజయ డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మి

నవతెలంగాణ-తాడ్వాయి

నాణ్యమైన పాల ఉత్పత్తికి అధిక ప్రాధాన్యత నివ్వాలని తెలంగాణ రాష్ట్ర విజయ డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్ చిట్టెం లక్ష్మి తెలిపారు. తాడ్వాయి మండలం ఎర్రపహాడ్ గ్రామంలోని పాల శీతలీకరణ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. అనంతరం కరడ్‌పల్లి గ్రామంలోని పాల కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పాల ఉత్పత్తిలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తేనే పాలకు మంచి గిట్టుబాటు ధర లభిస్తుందని తెలిపారు. రైతులు పాల ఉత్పత్తి పెంచడంలో కృషి చేయాలన్నారు. కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ.. రైతులు పాల ఉత్పత్తిని తమ సొంత వృత్తిగా భావించాలని సూచించారు. పాల ఉత్పత్తితో అధిక ఆదాయం పొందవచ్చని తెలిపారు. వ్యవసాయంతో పాటు పాల ఉత్పత్తిని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో బిఎంసియు అధ్యక్షులు బద్దం నరసింహారెడ్డి, డైరెక్టర్లు కిష్టారెడ్డి, బిఎంసియు మేనేజర్ రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.



పాలను పరిశీలిస్తున్న మేనేజింగ్ డైరెక్టర్, కలెక్టర్

అగ్గితెగులు నివారణ చర్యలు తీసుకోవాలి



సమావేశంలో పాల్గొన్న గ్రామస్తులు

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని అడ్లూరు ఎల్లారెడ్డి గ్రామంలో రిలయన్స్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో విలేజ్ డెవలప్‌మెంట్ ఫోరం రెండవ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో చేయవలసిన కార్యక్రమాల మీద హాజరైన సభ్యులు రిలయన్స్ ప్రతినిధి రాకేష్‌తో చర్చించారు. ప్రస్తుతం రైతులకు సుడోమనాస్ వరి పైరుకు అగ్గి తెగులు రాకుండా వాడుకోవడానికి ఉచితంగా ఇవ్వాలని, వీటితోపాటు కూరగాయలు పండించే రైతులకు కేవలం 20పైసలు ఒక మొక్క చొప్పున గరిష్ఠంగా పదిహేను వందల మొక్కల వరకు ఇవ్వడానికి రిలయన్స్ ఫౌండేషన్ ముందుకు వచ్చిందని తెలిపారు. రిసోర్స్ పర్సన్‌గా టీటీపేటకు చెందిన సిద్ధిరాములు హాజరై తాను ఏ విధంగా వర్మీ కంపోస్ట్ తయారు చేస్తున్నాడో కార్యక్రమంలో తెలియజేశారు. వేస్ట్ నుంచి వర్మీ కంపోస్ట్ తయారు చేసుకుని పంటలకు వాడుకుంటే గణనీయంగా తగ్గించుకోవచ్చని అనుభవపూర్వకంగా తెలుసుకున్న విషయాన్ని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సొసైటీ చైర్మన్ మర్రి సదాశివరెడ్డి, విజయ పాల డెయిరీ అధ్యక్షుడు దుబ్బాక నర్సారెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆకుల సిద్ధిరాములు, వార్డ్ మెంబర్ ఎల్లగారి రాజయ్య రైతులు మాజీ ఎంపీటీసీ బొల్లిపల్లి గంగారెడ్డి, బొల్లిపల్లి పద్మారెడ్డి, షేకల్లి బాలరాజ్, ఆకుల గంగరాజం, గడ్డం కిష్టయ్య, లింబాయల శ్రీనివాస్‌రెడ్డి, చెరుకు గంగయ్య, కుమ్మరి అంజయ్య, చాకలి గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

నర్సరీ పరిశీలించిన ఎంపీడీవో



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డిపేట మండలంలోని అచ్చాయిపల్లి గ్రామంలో ఏర్పాటు చేస్తున్న నర్సరీని బుధవారం ఎంపీడీవో రఘు పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సరీలో ఏర్పాటు చేస్తున్న మొక్కల వివరాలను సంబంధిత అధికారిని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా మెల్లకుంట తండాలో ప్రకృతి వనాన్ని ఎంపీడీవో పరిశీలించారు.

అండర్-17 బాలుర కబడ్డీ పోటీలు



మెడల్స్‌తో విజేతలు

నవతెలంగాణ-రాజంపేట్

మండలంలోని ఆర్గొండ గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని హిందూ సేన ఆధ్వర్యంలో అండర్-17 బాలుర కబడ్డీ పోటీలు బుధవారం నిర్వహించారు. ఈ పోటీలో ఆరుజట్లు పాల్గొనగా పోటీలలో బాలురు హోరాహోరీగా తలపడ్డారు. విజేతలకు మెడల్స్ సురేష్, సతీష్ అందజేశారు.

డబుల్ బెడ్ రూమ్‌లను కబ్జా చేసిన గ్రామస్తులు

- తిరిగి స్వాధీనం చేసుకున్న తహసీల్దార్

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కళ్యాపూర్ గ్రామంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ గదులను కొందరు కబ్జా చేసినట్లు తెలిసిందని తహసీల్దార్ రామచందర్ పేర్కొన్నారు. వెంటనే ఎస్ఐ ఉదయ్ కుమార్‌తో కలిసి ఘటనా స్థలానికి వెళ్లి కబ్జా చేసిన వారందరినీ అక్కడి నుంచి తొలగించి తిరిగి తాళాలు వేశామని ఆయన స్పష్టం చేశారు. డబుల్ బెడ్ రూమ్ రూమ్‌లకు సంబంధించిన లబ్ధిదారుల జాబితా తన వద్ద ఉందని తనకు తెలియకుండా ఇలా అబ్జర్వ్ చేశారని ఆయన గ్రామస్తులను నిలదీశారు. స్థానిక సర్పంచ్ భర్త తమకు తాళాలు ఇస్తేనే తాము వాటిని శుభ్రం చేసుకుంటున్నామని వారు పేర్కొన్నారు. అర్హులైన వారి జాబితా ప్రకారమే డబుల్ బెడ్ రూములను పంపిణీ చేయనున్నట్టు తహసీల్దార్ స్పష్టం చేశారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రం నుంచి వీరన్నగుట్టవైపు వెళుతున్న ఇసుక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ఉదయకుమార్ పేర్కొన్నారు. అక్రమంగా ఇసుక రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా అక్రమ ఇసుకను రవాణా చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఆయన పేర్కొన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

- మొదటి బహుమతి అందుకున్న పెద్దకొడప్‌గల్

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండలంలోని కాటేపల్లి గ్రామంలో యువకులు సంక్రాంతి పండుగ సందర్భంగా క్రికెట్ టోర్నమెంట్ పోటీలను నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో పలు జట్లు పాల్గొని పోటీపడ్డాయి. ఈ పోటీలో బుధవారం ఫైనల్ మ్యాచ్‌లో కాటేపల్లి, పెద్దకొడప్‌గల్, తలపడగా.. మొదటి బహుమతిని పెద్దకొడపగల్ జట్టు గెలుచుకోగా, రెండవ బహుమతి కాటేపల్లి జట్టు గెలిచినట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు విజయ్, శ్రీనివాస్, సాయి ప్రశాంత్, ప్రజాప్రతినిధులు సర్పంచ్ విట్టల్, విజయదేశాయ్, బోధనం సాయిలు, జానీ, జంబిగి హన్మాండ్లు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రణయ్ రెడ్డి, ప్రేమ్ సింగ్, జనార్ధన్, బన్ను, చంద్రశేఖర్‌గౌడ్, యువకులు క్రీడాకారుల పాల్గొన్నారు.



బహుమతితో గెలుపొందిన జట్టు

మద్యం మత్తులో వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మద్యం మత్తులో పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని బేగంపూర్ తండాలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బేగంపూర్ తండాకు చెందిన లంబాడి గురుదాస్ (28) అనే వ్యక్తి సోమవారం మధ్యాహ్నం సమయంలో పంట పొలం వద్ద మద్యం తాగి అదే మత్తులో పురుగుల మందు తాగాడు. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు కుటుంబ సభ్యులు వెంటనే బాన్సువాడ ప్రభుత్వాస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించిన అనంతరం మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం రాత్రి మృతిచెందాడు. మృతునికి మూడు సంవత్సరాల కుమారుడు ఉన్నాడు. భార్య అనిత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.